**మంచిమాట**

తమ సమస్యలను నీతో పంచుకునే వారిని చిన్నచూపు చూడకు... నీకు చెప్పడం వారు అసమర్థులై కాదు, నీమీద నమ్మకంతో.


# నేటి చర్చ

జాతీయ తెలుగు దిన పత్రిక

TS-11-0036701



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 10 శనివారం, జనవరి 10, 2026 , పేజీలు - 12 వెల : 2/-


# వివాదాలు కాదు..
# పరిష్కారాలు ముఖ్యం

- ఉమ్మడి రాష్ట్రంలోప్రాజెక్టులకు అడ్డంపడకండి
- జలవివాదాలతో రాజకీయ ప్రయోజనం కోరుకోం
- మన సమస్యలను మనమే కలిసి పరిష్కరించుకుందాం
- ఎపి సిఎం చంద్రబాబుకు తెలంగాణ సిఎం రేవంత్ సూచన
- కృష్ణా జలాలపై ఏపీతో చర్చలకే ప్రాధాన్యం
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవం





హైదరాబాద్,జనవరి 9 : రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించు కోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. లో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని మిగతా2లో...




## జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు
# బడ్జెట్ సమావేశాలు

● తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ● 29న ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టనున్న కేంద్రం ● యథావిధిగా ఫిబ్రవరి1ననే బడ్జెట్ ప్రసంగం

## రచ్చకెక్కిన బెంగాల్
# రాజకీయం

● ఇడి చర్యలపై మమతా నిరసన ప్రదర్శన ● మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బిజెపి

● విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఇడి పిటిషన్



కోల్‌కతా,జనవరి 9 : ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయా రంటూ తనపై మిగతా2లో...

## పిఠాపురంలో గొడవలు చేస్తామంటే
# ఏరిపారేస్తా...

అవాస్తవాలు వైరల్ చేస్తూ చూస్తూ ఊరుకోను

శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి

పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి

పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్

సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు



కాకినాడ,జనవరి 9 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా సుమారు రూ.3 వందల కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్య క్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పీఠికాపుర సంక్రాంతి మహోత్సవంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గలో కొందరు గొడవలు సృష్టించేందుకు వస్తే ఇక్కడే తాను తిష్టవేసి ఏరి పారేస్తానని హెచ్చరించారు. మిగతా2లో...



## ప్రశాంతంగా ముగిసిన
# ఉత్తర ద్వార దర్శనం

దర్శనాలపై దాదాపు 93 శాతం భక్తులు సంతృప్తి

స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు రాక

మీడియా సమావేశంలో టిటిడి చైర్మన్, ఇవోలు వెల్లడి

తిరుమల,జనవరి 9 : వైకుంఠ ద్వార దర్శనాలను అద్భుతంగా జరిపామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. టీటీడీ ఏర్పాటుచేసిన సౌకర్యాలపై భక్తులు హర్షం వ్యక్తం చేశారని చైర్మన్ తెలిపారు.వైకుంఠ ద్వార దర్శనాల విజయవంతంపై తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఏఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఏర్పాటు చేసిన మిగతా2లో...

## సంస్కృతి,సంప్రదాయాలను
# కాపాడుకోవాలి

● పండగల విశిష్టతను బాగా చాటాలి ● సంక్రాంతి అంటే నాకు ఎంతో ఇష్టం ● ఇందిర పుణ్యమా అని రాజకీయాల్లోకి వచ్చా ● విశాఖ సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు




# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

సైబర్ మిత్ర పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు

బాధితులు 1930కు ఫోన్ చేయాలన్న కమిషనర్ సజ్జనార్



హైదరాబాద్,జనవరి 9 : సైబర్ నేరాల బాధితులకు హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. శు క్రవారం నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సైబర్ మిత్ర పేరుతో రూపొందించిన ప్రత్యేక విభాగాన్ని సజ్జనార్ ప్రారంభించారు. అనంతరం సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. మిగతా2లో...

## ఉర్దూ వర్సిటీ భూముల
# జోలికి రావద్దు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి కెటిఆర్ హెచ్చరిక



హైదరాబాద్,జనవరి 9 : మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం మిగతా2లో...

## ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు
# ఎదురు దెబ్బలు

పోలీస్ అధికారులకు లొంగిపోయిన మరో 63మంది



రాయ్‌పూర్,జనవరి 9 : ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులు తున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులు ఎదుట 63 మంది మావోయిస్టులు లొంగిపో యారు. వారిలో 18 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్తీ.. తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న ఆయుధాలను పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. లొంగిపోయిన మొత్తం మావోయి స్టులపై రూ. కోటి రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లోన్ వర్రాటు మిగతా2లో...

## జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు

**న్యూఢిల్లీ,జనవరి 9 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తొలి దశ సమావేశాలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడిం చారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో దశ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఉభయ సభలు సమావేశం అయ్యేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన తేదీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తొలి రోజైన జనవరి 28న రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టను న్నారు. ఏటా మాదిరిగానే ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను సమర్పించ నున్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో సమావేశ తేదీలపై గత కొన్ని రోజులుగా సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వ తాజా ప్రకటనతో ఆ చిక్కుముడి వీడింది. దీంతో ఆదివారమైనా ఆ బడ్జెట్ యధాతథంగా ప్రవేశ పెడతారు.

# సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి

**విశాఖపట్నం, 9:** భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని., భారతీయ వంటలు అందరూ తినాలని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మన పండగల విశిష్టతను చాటాలన్నారు. సంక్రాంతి పండగ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. విశాఖపట్నంపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ., తాను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. తెలుగు రైతుల పండగ సంక్రాంతి., తెలుగు వారి లోగిళ్లలో ఇది పెద్ద పండగని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఫల సాయాన్ని అందించే వ్యవసాయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడని ప్రజలకు ఆయన హితవు పలికారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను, మాతృభాషను మర్చిపోకూడదని చెప్పారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో పరిపాలన చేయాలంటూ ప్రభుత్వాలకు ఆయన సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలంటూ తల్లిదండ్రులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక సూచన చేశారు.విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలు చేశానని.. జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె కారణంగానే తాను రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. స్వతంత్ర భారతదేశంలో ఆత్మ నిర్భర భారత్ కోసం అందరూ కృషి చేయాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ప్రపంచంలో నాలుగో వంతు జీడీపీ భారతదేశానిదేనని పేర్కొన్నారు. పశు సంపద ఎంత బాగుంటే జాతీయ సంపద కూడా అంత బాగుంటుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ముందు.. ఎవరు ఎన్ని సుంకాలు వేసినా ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఆత్మ నిర్భర భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ అంటున్నారని వివరించారు. తాను రైతు బిడ్డగా పుట్టానని., అందుకే రైతులు అంటే తనకు చాలా అభిమానమన్నారు.

# వివాదాలు కాదు..పరిష్కారాలు ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు., ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ., దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములను తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

## రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హాజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

## పిఠాపురంలో గొడవలు చేస్తామంటే ఏరిపారేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో కాకి ఈక పడ్డ ఏదో జరిగిందని వైరల్ చేస్తూ అవాస్తవాలను ప్రసారం చేస్తున్నారని మండిపడ్డారు. పులివెందులలో సొంత బాబాయ్ వైఎస్ వివేకను ని చంపినా అది వార్తకాదని, పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకోవడం సహజమని, దానిని కూడా పెద్ద వార్త చేస్తున్నారని అన్నారు.సంక్రాంతి పండుగ అంటే కేవలం కోళ్ల పందెలు, జూదాలకు మాత్రమే కాకుండా ప్రేమను పంచాలని సూచించారు. తెలంగాణలో ఉన్న సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి ఆంధ్రా ప్రాంతా ప్రజల ప్రేమను పంచాలని అన్నారు. ఐక్యమత్యంగా ఉంటే అభివృద్ధి సాధించవచ్చన్న ఉద్దేశంతో టీడీపీతో కూటమిగా ఏర్పడడం వల్ల రాష్ట్రానికి ఎంతగానో మేలు జరుగుతుందని అన్నారు. అందరిని కలపడం కష్టమని అటువంటిది తాను గల్లీ నుంచి ఢిల్లీ వరకు అందరినీ ఏకం చేసి విజయం సాధించానని అన్నారు.అభివృద్ధి లక్ష్యం నెరవేరే వరకు కూటమితో కలిసి ఉంటామని, అందులో సందేహం అవసరం లేదని వెల్లడించారు. వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లయితే తాను ఎందుకు రాజకీయాల్లోకి వస్తానని పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉత్తర ద్వార దర్శనం

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పదిరోజుల్లో 7.83 లక్షల మంది భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారని, హుండీకి రూ.41.14 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు.శుక్రవారం రికార్డు స్థాయిలో 83 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందజేశామని , భక్తుల రద్దీని ఏఐ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరిపామని పేర్కొన్నారు. సామాన్య భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అవసరమైన వసతి గదుల కేటాయింపు చేశామని అన్నారు.ఉద్యానవనం విభాగం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో రంగనాయక ఆలయ సెట్ భక్తులకు విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. ఇందుకు అవసరమైన 50 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, 4 టన్నుల కట్ ఫ్లవర్స్‌తో డెకొరేషన్ చేశామన్నారు. కల్యాణ కట్టలో 2.06 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారని చైర్మన్ వివరించారు.

# ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

(మొదటి పేజీ తరువాయి)

(ఇంటికి తిరిగి రండి) ప్రచారంలో భాగంగా వీరంతా లొంగిపోయి నట్లు పోలీసులు తెలిపారు. మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలి స్తామని కేంద్ర ప్రకటించింది. అందుకోసం ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దాదాపుగా మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. చివరకు ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రభావం కొంత మేర ఉంది. ఆ రాష్ట్రంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల ఏరివేతకు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వేలాది మంది మావోయిస్టులు ఇప్పటికే ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన రివార్డులను అందజేస్తోంది. అదీకాక.. మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగం కావాలంటూ ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌లో పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్‌కాగా.. కీలక నేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు.

# కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ఖమ్మం,జనవరి 9 :** పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను దీవించినట్లే.. పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. పంచాయితీలు, పురపాలికలు బలపడాలంటే అధికార పార్టీ అభ్యర్థులు ఉండాలన్నారు. ఇల్లందు పట్టణంలో నూతన రహదారులు, కాలువల నిర్మాణాలకు శుక్రవారం మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గంలోని నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటే గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో పర్యటించి, జీవో 76కు సంబంధించిన క్రమబద్ధీకరణ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# నటుడు నవదీప్‌కు హైకోర్టులో ఊరట

### - డ్రగ్స్ కేసును కొట్టేసిన తెలంగాణా న్యాయస్థానం

**హైదరాబాద్,జనవరి 9 :** టాలీవుడ్ యంగ్ హీరో నవదీప్‌నకు హైకోర్టులో భారీ ఉపశమనం కలిగింది. అతడిపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణా న్యాయస్థానం కొట్టివేసింది. నవదీప్ వద్ద డ్రగ్స్ ఉన్నట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదనే ఆయన తరఫు న్యాయవాది వెంకట సిద్ధార్థ్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ కేసును కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. దీంతో ఈ యంగ్ హీరోకు పూర్తిస్థాయిలో ఉపశమనం లభించినట్లైంది. కొద్ది నెలల క్రితం.. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులో హీరో నవదీప్ పేరు వినిపించడంతో ఆయన డ్రగ్స్ తీసుకున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. అందులో భాగంగా.. గుడిమల్కాపూర్‌లో నమోదైన కేసులో ఎఫ్ఐఆర్‌లో అతడి పేరు నమోదైంది. ఈ ఆరోపణలపై నవదీప్ ఘాటుగా స్పందించారు. తనకు, డ్రగ్స్‌కు ఎలాంటి సంబంధం లేదని అతను వాపోయాడు. ఈ నేపథ్యంలోనే తనను అరెస్ట్ చేయెద్దంటూ అతను గతంలో తెలంగాణా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ పిటిషన్ను విచారించిన న్యాయస్థానం.. అరెస్ట్ చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఈ కేసుపై మరోసారి విచారణ చేపట్టింది న్యాయస్థానం. నవదీప్ పేరును కేవలం ఎఫ్ఐఆర్‌లోనే చేర్చారని.. అతను డ్రగ్స్ తీసుకున్నట్టు ఆధారాలేవీ లేవని స్పష్టం కావడంతో ఈ కేసును కొట్టివేసింది.



# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

(మొదటి పేజీ తరువాయి)

సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితులకు ఈ సెల్ ఎంతో సహాయంగా ఉంటుందన్నారు. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటైందని వివరించారు. సైబర్ క్రైమ్‌ల్లో బాధితుల సంఖ్య పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి ఫోన్ చేయాలని బాధితులకు సూచించారు. సైబర్ దాడికి గురైతే మ్యూల్ ఖాతాలకు నగదు బదిలీ అయి.. విత్ డ్రా చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే గో÷-డలెన్ అవర్‌ను వినియోగించుకోవాలంటూ బాధితులకు ఆయన కీలక సూచన చేశారు. నేరం జరిగిన గంట లోపు ఫిర్యాదు చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేస్తే సరిపోదన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయాల్సి ఉందని చెప్పారు. కానీ చాలా మందికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదన్నారు. నూతన విధానం ద్వారా బాధితులు తమ ఫిర్యాదును పోస్ట్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ద్వారా పంపవచ్చన్నారు. సైబర్ మిత్ర సెల్‌లోని పోలీసులు.. బాధితులకు ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా రాయాలి? ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఇంటి నుంచే ఎఫ్ఐఆర్ పొందే సౌకర్యాన్ని కల్పించడం ద్వారా 100 శాతం కేసుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ట్రయిల్‌లో భాగంగా 86 మందికి ఫోన్ చేశామని.. వారి నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సైబర్ నేరానికి గురికాకుండా

## కారుకొండ రామవరం మరియు యుఎఫ్ డబ్ల్యు సి ని సందర్శించిన డాక్టర్ తుకారం రాథోడ్





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ జిల్లా కేంద్రంలోని కారుకొండ రామవరం మరియు యు ఎఫ్ డబ్ల్యు సి కొత్తగూడెంను సందర్శించడం జరిగినది. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమమును అకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది .ప్రజలతో అయా గ్రామాలలో వారి ఇంటి చుట్టూపరిసరాలను శుభ్రంగా ఉంచేటట్లు వారికి అవగాహన ఇవ్వాలని తెలియజేశారు. రికార్డులను పరిశీలించారు అదేవిధంగా యు ఎఫ్ డబ్ల్యు సి కొత్తగూడెం ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే గదిని పరిశీలించి, మందులను సరైన ఉష్ణోగ్రత ను మెయింటెన్ చేయాలని, మరియు ఒకసారి ఓపెన్ చేసిన వయల్ మీద తేదీ సమయం తప్పకుండా రాసి కంటైనర్లు నిల్వ చేయాలని సూచించారు. రికార్డులను సక్రమంగా రాసి భద్రంగా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీ చేసిన డాక్టర్ తుకారం రాథోడ్



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే , గత నెల 18 నుంచి 31 వరకు జరిగిన ఇంటింటి సర్వే కార్యక్రమంలో 1,708 మంది కుష్టు అనుమానితులుగా గుర్తించడం జరిగింది. వీరిని ఈ నెల నుండి 1 వ తేది నుండి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యులు మరియు ఉప కేంద్రాలలో డీపీఎంఓలు కుష్టు అనుమానితులను పరీక్షించి నిర్ధారణ చేయడం జరుగుతుంది. ఇందులో ఇప్పటివరకు 1,013 మందిని పరీక్షించి 22 మందిని కుష్టు వ్యాది గ్రస్తులు గా నిర్ధారించి మందులు యివ్వడం జరిగింది. వచ్చినటువంటి అనుమానిత కేసులలో కొమరారం, గుండాల , రొంపేడు చంద్రుగొండ, ఏర్ర గుంట ఆరోగ్య కేంద్రాల పరిదిలో కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా తుకారాం రాథోడ్ తెలిపారు. మరియు గత నెల చివరి వరకు జిల్లాలో కుష్టు వ్యాధి మందులు వాడే వారి సంఖ్య 52 మంది , యిందులో 45 ఎంబీ కేసులు గా 7 పిబి వ్యాధిగ్రస్తులు గా మందులు వాడుతున్నారు. మరియు కొత్తగూడెం డివిజన్ పరిధిలో 37 మంది , భద్రాచలం డివిజన్ పరిధిలో 15 మంది వ్యాధికి చికిత్స నిమిత్తం మందులు వాడుతున్నారు, మరియు డీఎం

## రవాణా శాఖ యూనిట్ కార్యాలయం తరలింపు నిలిపివేయాలి వైరాలోనే రవాణా శాఖ కార్యాలయం కొనసాగించాలి



చర్చ: వైరా :నియోజకవర్గ కేంద్రమైన వైరాలో 1998 వ సంవత్సరం నుంచి రవాణా కార్యకలాపాలు కొనసాగు తున్నా యని ,ప్రస్తుతం కూడా వైరాలో ఉన్న రవాణా శాఖ కార్యాలయాన్ని బోనకల్లు తరలించకుండా వైరాలనే కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జున రావు బాణాల వెంకటేశ్వర్లు వనమా విశ్వేశ్వ రరావు,అన్నారు. శుక్రవారం వైరాలో వారు మాట్లాడుతూ వైరా రవాణా యూనిట్ ను ఎక్కడికి తరలించవద్దని వైరాలో ఉండటం వల్ల ప్రజలకు ఎంతో ఎసులుబాటుగా సౌకర్యం ఉంటుందని కార్యాలయానికి రావడానికి రవాణా సౌకర్యం ఉందని అదేవిధంగా ప్రతి ఒక్కరు ఎంతో ఉపయోగపడే కేంద్రం వైరా, అలాంటి కేంద్రాంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయమైన రవాణా శాఖ యూనిట్ బోనకల్లుకు తరలించడం అంటే కేవలం ఇది రాజకీయ స్వార్థమేనని వారు అన్నారు .తక్షణమే తరలింపు విధానాన్ని మానుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దేల రవి, దొంతబోయిన వెంకటేశ్వర్లు,మాదినేని దుర్గాప్రసాద్, సూకల వాసు,కామినేని శ్రీనివాసరావు, దేవరాజు,ఏదునూరి శ్రీనివాసరావు, పారుపల్లి నాగం, వజినేపల్లి చక్రవర్తి, అదూరి ప్రేమ్ కుమార్ , అయినాల కనకరత్నం, బొడ్డు రామకృష్ణ,రేచర్ల సైదులు , సల్లగొండ నాని, విలాసాగరం సరేష్, మదుపల్లి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు

## లూయిస్ బ్రెయిలీ స్ఫూర్తితో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి- డాక్టర్ తుకారం రాథోడ్




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:లూయిస్ బ్రెయిలీ 217 వ జయంతోత్సవ వేడుకలను జిల్లా సంక్షేమ శాఖ వారి కార్యాలయ మీటింగ్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం రాథోడ్ మరియు జిల్లా సంక్షేమ శాఖ అధికారినీ జే.ఎం.స్వర్ణలతా లెనిన పాల్గొన్నారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి జయంతోత్సవాన్ని ప్రారంభించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారిని మాట్లాడుతూ బ్రెయిలీ కనిపెట్టిన చుక్కల లిపి ద్వారా అందుల జీవితాలలో వెలుగులు నింపారని ఈ లిపి ద్వారా అందులు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అదిరోహించారని లూయిస్ త్యాగాన్ని కీర్తించారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని దివ్యాంగుల వివాహ ప్రోత్సాహం, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్,ఉపాస్ ద్వారా సహాయ ఉపకరణాలు,ఓబిఎంఎంఎస్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. డి ఎం హెచ్ ఓ అధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, బ్రెయిలీ లిపి కనుగొనడం ద్వారా ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపారని కీర్తించారు. అంధులైన ఉద్యోగస్తులకు, అందుల కొరకు వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారికి సన్మానించి గోడ గడియారాలు బహూకరించారు. ఈ జయంతోత్సవాలకు బ్లైండ్ అసోసియేషన్ సభ్యులు ఎం.నరేందర్, రాజ్ కిరణ్, రమణయ్య,ఉపేంద్రమ్మ, అనుష,కిరణ్,వరప్రసాద్, నాగేశ్వరరావు,నరేష్,ప్రవీణ్ మరియు డిహెచ్ఈడబ్ల్యు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం



చర్చ: సిద్దిపేట:సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలి. టిపిటిఎఫ్ జాతీయ ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నేడు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించడమైనది సిద్దిపేటలో స్థానిక ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో విరామ సమయంలో జరుగుతున్న నిరసన కార్యక్రమం లో టీ పి టీ ఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2012 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్టు (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నుండి మినహాయించేందుకు ప్రత్యేక చట్టాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టి, టెట్టును రద్దు చేయించాలని డిమాండ్ చేశారునూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ,నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కలిగించాలని, పాఠశాల విలీనాన్ని, మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని తెలియజేశారు .10వ తేదీ నాడు ఐదు డిమాండ్ల పైన ప్రధానమంత్రి కి, రాష్ట్రపతికి ఉత్తరాలు రాయాలని ,ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి 5వ తేదీన పెద్ద ఎత్తున చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు జాతీయస్థాయిలో జేఏసీ చేసే ప్రతి ఉద్యమానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీగా, టిపిటిఎఫ్ గా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే శరణ్యంగా పోరాడాలని ఉపాధ్యాయ లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకటరమణ, శ్రీనివాస్ ,శ్రీదేవి , వజ్రమ్మ, సుజాత,దుర్గయ్య, రామ్మోహన్ గౌడ్ ,సాగర్, గోవర్ధన్ ,నరసింహులు, రాజు ,రాజకుమార్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## వైరాలోనే ఆర్టీవో కార్యాలయాన్ని కొనసాగించాలి

- ఆర్టీవో కార్యాలయం వద్ద సిపిఎం(ఎం) నిరసన
- బోనకల్‌కు మార్చితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం హెచ్చరిక
- అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి దినేష్ కు వినతి





చర్చ:వైరా :వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు విశేషంగా సేవలు అందిస్తున్న వైరా ఆర్టీవో కార్యాలయాన్ని వైరా నియోజకవర్గ కేంద్రంలోనే కొనసాగించాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరా ఆర్టీవో బోనకల్ కు మార్చితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఆర్టీవో కార్యాలయాన్ని బోనకల్ కు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీవో కార్యాలయం వద్ద సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.దినేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా వైరా కేంద్రంగా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా సేవలందిస్తున్న రవాణా శాఖ కార్యాలయాన్ని వైరా నుంచి మధిర నియోజకవర్గం బోనకల్‌కు మార్చాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వైరాలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా కార్యాలయాన్ని బోనకల్ కు తరలించడాన్ని సిపిఐ(ఎం) పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. నిర్ణయం వల్ల వైరా, కొణిజర్ల, తల్లాడ, ఎన్కూరు మండలాల ప్రజలకు రవాణా సేవలు అందనంత దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బోనకల్ మండల కేంద్రంలో ఆర్టీవో కార్యాలయం ప్రారంభించేందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు గురువారం బోనకల్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న స్థలాన్ని వైరా ఎంవిఐ వరప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, యుడిసి ఉపేందర్ పరిశీలించారని తెలిపారు. బోనకల్ కు కొత్త ఆర్టీవో కార్యాలయం మంజూరు చేయాలని సూచించారు. వైరాలో ఉన్న రవాణా శాఖ కార్యాలయాన్ని వైరాలోనే కొనసాగించాలని కోరారు. బోనకల్ కు మార్చడం వల్ల వేలాది మంది ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకుంటున్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యురాలు మచ్చా మణి, నాయకులు గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్ రావు, కొంగర సుధాకర్, షేక్ నాగుల్ పాషా, తోట కృష్ణవేణి, మందడపు రామారావు, మల్లెంపాటి ప్రసాదరావు, మాడపాటి రామారావు, యనమద్ది రామకృష్ణ, అమరనేని కృష్ణ, పానుగంటి రాంబాబు, మాడపాటి వెంకటేశ్వరరావు, మాడపాటి సుజాత, చావా కళావతి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం నియోజకవర్గంలో సంక్షేమ సంబురం

- రూ.22.20కోట్ల సంక్షేమ పథకాల చెక్కులు అందించిన కూనంనేని
- అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యతనిస్తున్నాం
- పేదల ఆర్థికభారాన్ని మోయడం అభినందనీయం
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



చర్చ,కొత్తగూడెం:పేదవర్గాలకు మునుపెన్నడూ లేనివిధంగా పెద్దమొత్తంలో సంక్షేమ పథకా డబ్బులు మంజూరు కావడంతో కొత్తగూడెం నియోజకవరంలో సంక్షేమ సంబరం నెలకొంది. కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకంలో 201మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.2.12కోట్ల విలువైన చెక్కులు, అదేవిధంగా చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ పథకంలో 50 మందికి మంజూరైన రూ.20.70లక్షల విలువైన చెక్కులను కొత్తగూడెం క్లబ్బులు జరిగిన కార్యక్రమంలో శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు, ప్రజాసంక్షేమ పథకాలకు సమప్రాధాన్యతనిస్తున్నామని, పార్టీలకతీతంగా ప్రతిపేద కుటుంబానికి సంక్షేమపథకాలు, అభివృద్ధిఫలాలు అందిస్తున్నామన్నారు. పేదకుటుంబాల ఆర్థికాభిరాన్ని తీర్చేం దుకు ప్రభుత్వం సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేయడం అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు చేరవేయడమే తన బాధ్యతని, ముఖ్యంగా ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి పథకం ఆర్థిక భరోసానిస్తుండగా, ఆపద సమయంలో వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు పూర్తినమ్మకాన్ని కలిగించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా, డిప్యూటీ కలెక్టర్ పానెం కృష్ణ, తహసీల్దార్లు వనం కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ దారా ప్రసాద్, సర్పంచులు, మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మేడా శంకరయ్య సుశీలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 1.57 లక్షలతో సేవా కార్యక్రమాలు

- 18 రోజుల్లోనే గ్రామంలో పలు సౌకర్యాలు ఏర్పాటు
- విప్పలమడక గ్రామ సర్పంచ్ మేడా హేమిమా చక్రపాణి వెల్లడి



చర్చ: వైరా : వైరా మండలంలోని విప్పలమడక గ్రామంలో మేడా శంకరయ్య సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 1.57 లక్షలతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఆ గ్రామ సర్పంచ్ మేడా హేమిమా చక్రపాణి తెలిపారు. కేవలం 18 రోజుల్లోనే ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5 సామాజిక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. విప్పలమడక గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో సర్పంచ్ హేమిమా చక్రపాణి మాట్లాడుతూ మేడా శంకరయ్య - సుశీలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.75 వేలతో గ్రామంలో 100 వాట్స్ ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో వైరాకు చెందిన పురుగు మందుల వ్యాపారి కొప్పుల వెంకటప్పారావు సహకారంతో 20వేల రూపాయల విలువ చేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. గ్రామానికి చెందిన ఇమ్మడి పెద్ద వెంకయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి రూ. 12 వేలు విలువచేసే వాటర్ ప్యూరిఫైయర్ ను అందజేశారని పేర్కొన్నారు. ఇదే గ్రామానికి చెందిన మన్నెం నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మన్నెం సాయి ఈ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయానికి 30 వేల రూపాయల విలువచేసే ల్యాప్టాప్ ను అందించేందుకు ముందుకు వచ్చారని వివరించారు. విప్పలమడక గ్రామంకు గోపాలమిత్రను నియమించాలని, నూతన పశువుల స్టాండును ఏర్పాటు చేయాలని, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలను పరిష్కరించాలని, అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని, మిషన్ భగీరథ పంపు ఆపరేటర్ ను నియమించాలని తదితర అంశాలపై తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్ పాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, ఉప సర్పంచ్ బొర్రు లూర్థమ్మ, మాజీ ఉప సర్పంచులు కొలికొండ వీరభద్రరావు, వీరపనేని చెన్నకేశవరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ డైరెక్టర్ దేవభక్తిని అర్జున్ రావు, వార్డు సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం




చర్చ:- హుస్నాబాద్: పట్టణంలోని మార్కెట్ యార్డులో వైద్యశాఖ ఆదేశాలతో సురభి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ హెల్త్ క్యాంప్ లో వివిధ విభాగాలను పరిశీలించి ఎంత మందికి పరీక్షలు చేశారు. వారికి అవసరమైన చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారుఅనంతరం 21 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హైమవతి, డీఎంహెచ్ఓ ధనరాజ్, సురభీ మెడికల్ డీన్ రఫీ,గ్రంథలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి,వైస్ చైర్మన్ బంక చందు,ఆర్డీవో లు ,ఇతర ముఖ్య నేతలు, అధికారులు హుస్నాబాద్ నియోజకవర్గంలోనీ కోహెడ లో ఆర్వీఎం హాస్పిటల్ , అక్కన్నపేట లో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ ,హుస్నాబాద్ లో సురభి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ జరుగుతుందిమండలాల వారిగా ఉన్న సబ్ సెంటర్లలో హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేయడం జరుగుతుంది పండగ తర్వాత 30 మెడికల్ క్యాంప్ లు జరుగుతాయి

ప్రభుత్వం పక్షన 7 మండలాలకు

ఏడు మెడికల్ కాలేజీల లు దత్తత తీసుకొని మెడికల్ క్యాంప్ లు చేస్తున్నాయి

మెడికల్ క్యాంప్ లలో పరీక్షలు చేసుకొని అవసరమైన చికిత్స తీసుకోండి.సురభి మెడికల్ కాలేజీ కి ధన్యవాదాలుమండలంలోని అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలిఈ నియోజకవర్గం ఆరోగ్య వంతంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు

క్యాంపు లు ఏర్పాటు చేస్తున్నాంహుస్నాబాద్ లో 250 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుంది.తరువాత

పీజీ కాలేజీ వస్తుంది వైద్య పరీక్షలు

అన్ని ఇక్కడే జరుగుతాయి.



# అశ్వారావుపేట నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయ పథకాల ప్రారంభం

**- రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**- తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్ వన్‌భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి/సహజ వ్యవసాయ విధానాల అమలుకు అశ్వారావుపేటను కేంద్రంగా చేసుకొని శ్రీకారం చుట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ, సహకార మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పథకాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట



శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రైతు మేళా, టీజీ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూసార పరీక్ష--ఆయిల్‌పామ్ పత్రాల సమగ్ర పరిశీలనా ప్రయోగశాల, నేషనల్ మిషన్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాలను మంత్రులు ప్రారంభించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో బయోడైవర్సిటీ పార్కు ఏర్పాటు, రూ.5 కోట్లతో బాలికల వసతి గృహ నిర్మాణం, రూ.3 కోట్లతో 3 కిలోమీటర్ల బీటీ రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.వ్యవసాయ యంత్ర పరికరాలు, ఆధునిక సాంకేతిక సేద్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, యాంత్రీకరణ సామగ్రితో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను మంత్రులు పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. అనంతరం రైతు మేళాలో పాల్గొన్నారు.

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ**

దివంగత నేత ఎన్టీఆర్ మంజూరుతో సుమారు 35 సంవత్సరాల క్రితం స్థాపించిన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల దేశ విదేశాల్లో నిపుణులను తయారు చేస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థగా ఎదిగిందన్నారు. ఈ కళాశాల అభివృద్ధికి వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ కళాశాల కంటే మిన్నగా అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏ పంట వేసినా పండించే సామర్థ్యం ఉన్న రైతులు ఉన్నారని ప్రశంసించారు. ఆయిల్‌పామ్ సాగులో కోకో, మిరియాలు, జాజి వంటి అనుబంధ పంటలను కూడా రైతులు విజయవంతంగా సాగు చేస్తున్నారని తెలిపారు. గిరిజన రైతులు అధికంగా ఉన్న ఈ జిల్లాలో గోదావరి జలాలతో పాటు అధిక ఆదాయం ఇచ్చే ఆధునిక పంటలను సాగు చేసి జిల్లా తెలంగాణకే కాకుండా దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు.

రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారని, చిన్న, సన్నకారు, గిరిజన, బీసీ రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చొరవతో 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 2047 నాటికి వ్యవసాయ రంగం ద్వారా 400 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**భారీ నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**మాట్లాడుతూ :**

వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం రెండూ రైతులకు అత్యంత ఉపయోగకరమైన పథకాలన్నారు. గతంలో నిలిచిపోయిన యాంత్రీకరణ పథకాలను పునఃప్రారంభించి 50 శాతం సబ్సిడీతో రైతులకు యంత్ర పరికరాలు అందించడం శుభపరిణామమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.31 లక్షల మంది రైతులకు రూ.101 కోట్ల వ్యయంతో వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో నాచురల్, ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వరి ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని, ఈ సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందన్నారు. వరి కొనుగోలులో 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో పాటు బోనస్ కూడా అందజేస్తున్నామని చెప్పారు

**అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ :**

గుమ్మడవెల్లి ప్రాజెక్టు రింగ్‌బండ్ నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ముడిపడి ఉన్నందున ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. అశ్వారావుపేటలోని అంకమ్మ చెరువు నుంచి లోతువాగు--దెబ్బతోగు ద్వారా గుమ్మడవెల్లి ప్రాజెక్టుకు నీరు చేరే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన భూ సేకరణ కొంతవరకు పూర్తై, కొంత పెండింగ్‌లో ఉందని పేర్కొంటూ భూ సేకరణను పూర్తి చేయాలని మంత్రులను కోరారు.మూకమామిడి ప్రాజెక్టు ద్వారా 7,675 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్:**

జిల్లాలో వ్యవసాయ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ శాఖ మంత్రి దిశానిర్దేశంలో పలు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, బయోచార్ తయారీ వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. యువ రైతులు ఆధునిక సాంకేతికతతో వ్యవసాయంలోకి రావాలని పిలుపునిచ్చారు.వ్యవసాయ యాంత్రీకరణను సమర్థవంతంగా వినియోగించుకొని రైతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకంటే ఎక్కువ ఆదాయం సంపాదించే అవకాశం ఉందన్నారు. సమీకృత వ్యవసాయాన్ని అవలంబించాలని, ములకలపల్లి మండలం మొరంపల్లి బంజర గ్రామంలో మహిళలు సమీకృత వ్యవసాయం ద్వారా అధిక లాభాలు సాధిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమానికి పీజేటీఏస్ ఏయూ, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీలు జానయ్య, రాజిరెడ్డి, టీజీ ఆయిల్ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వ్యవసాయశాఖ ప్రధాన కార్య దర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ సంచాల కులు గోపి, ఉద్యానశాఖ సంచా లకులు, టీజీ ఆయి ల్ఫెడ్ ఎండీ ఎండీ శ్రీమతి యాస్మిన్ బాషా హాజరు అయ్యారు. సమావేశంలో టీజీ ఆయిల్ఫ్ బోర్డు సభ్యుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# 25మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**- కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పేదలకు రూ.7,65,000 మేరకు లబ్ధి**



చర్చ,కొత్తగూడెం:ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య సేవలు పొందిన పేద మధ్యతరగతి ప్రజానీకాన్ని ఆదుకునేందుకు., ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి( సీఎంఆర్ఎఫ్)నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ .7,65,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను విద్యాసగర్ కాలనీలోని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో.,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, తదితరులుతో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ., అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూరేలా, ఆరోగ్య భరోసా లభించేలా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో., మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.ం

# సీఎం కప్ -2026 టార్చ్ ర్యాలీకి ఘన స్వాగతం

- సత్తుపల్లి మండలంలో క్రీడా జ్యోతి ప్రవేశం
- జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి




చర్చ, సత్తుపల్లి:సీఎం కప్--2026 క్రీడా పోటీలలో భాగంగా శుక్రవారం రోజు (09-01-2026) మధ్యాహ్నం 1.30 గంటలకు క్రీడా టార్చ్ ర్యాలీ జ్యోతి సత్తుపల్లి మండలంలోకి ఘనంగా ప్రవేశించింది. ఈ సందర్భంగా నిర్వహించిన టార్చ్ ర్యాలీకార్యక్రమం ఉత్సాహంగా సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ క్రీడా టార్చ్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ,సీఎం కప్ పోటీలు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని, యువత క్రీడల్లో ముందుకు రావాలని ప్రోత్సాహక సందేశం ఇచ్చారు.సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం క్రమశిక్షణ ఐక్యత పెంపొందుతాయని తెలిపారు. ఈనెల 17వ తేదీ నుండి జరగబోవు సీఎం కప్ క్రీడలలో ఔత్సాహితులైన క్రీడాకారులు ప్రతి ఒక్కరూ గ్రామ,మండల, నియోజకవర్గ మరియు జిల్లా స్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు.

ఈ టార్చ్ ర్యాలీ సత్తుపల్లి ప్రాంతంలో క్రీడా ఉత్సాహాన్ని మరింత పెంచిందని జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్,ఎండీఓ,ఎంఈఓ, ప్రధానోపాధ్యా యులునాగే శ్వరరావు,సోందు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వృత్తి విద్యా ఉపాధ్యాయులు మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి నివారణకు హంగర్ సర్వీస్

- వారం రోజులు పాటు అన్నదానం
- శభాష్ సత్తుపల్లి లయన్స్




చర్చ, సత్తుపల్లి:సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరుగుతున్న సేవా కార్యక్రమాల పట్ల ప్రజల నుంచి పెద్దఎత్తున అభినందనలు వస్తున్నాయి. గత నెలలో పేదల కోసం ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభించారు.గత 780 రోజులు గా ప్రతిరోజూ ఉదయం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, బస్టాండ్ కూడలిలో యాచకులు, పేదలకు అల్పాహారం అందజేస్తున్నారు. తాజాగా హంగర్ వారోత్సవాలు.,సత్తుపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రమేశ్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా సత్తుపల్లి లో హంగర్ సేవా వారోత్సవం లో భాగంగా పేదలకు ఉచిత అన్నదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రభుత్వసుపత్రులో, మసీదు రోడ్ తదితర చోట్ల రోగులకు, వృద్ధులకు, పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చే న్నారావు, లయన్స్ సభ్యులు మరిశెట్టి సాంబశివ గుప్తా, పెనుగొండ రమేష్, గట్టే వాసు, సలీం, కలీల్, రహమద్, శ్రీను, వల్లి, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘురాం రెడ్డికి మొక్క అందజేసిన నైనిక రజువా



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకురాలు, కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థిని నైనిక రజువా ఎంపీకి మొక్కను అందజేశారు. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణ కోసం నైనిక చేస్తున్న కృషి గురించి ఎంపీ అడిగి తెలుసుకుని ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ పార్టీ యువ నాయకురాలు ఆకునూరి సుప్రియ, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, గంట గోపయ్య, మోహన్, ప్రకృతి హరిత దీక్ష సభ్యులు గౌస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నైనిక రజువాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఘనంగా సన్మానించారు.

# నంద తండా పల్లె దవాఖాన పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం




- సర్పంచ్‌ను సన్మానించిన డాక్టర్ వెంకటేష్
- పల్లె దవాఖానను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా అభివృద్ధి చేయాలని చర్చలు జరిపిన సర్పంచ్ మరియు డాక్టర్



చర్చ, చుంచుపల్లి: చుంచుపల్లి మండలం, నంద తండా పల్లె దవాఖాన పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపర్చే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ బలరాం, గ్రామ సెక్రెటరీ భూమిక, పల్లె దవాఖాన డాక్టర్ వెంకటేష్ గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి చెత్తను శుభ్రం చేశారు. దవాఖాన చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.
ఈ కార్యక్రమం అనంతరం గ్రామ అభివృద్ధి, పరిశుభ్రతకు నిరంతరం కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా పల్లె దవాఖాన డాక్టర్ వెంకటేష్ గ్రామ సర్పంచ్ బలరాంను శాలువాతో సన్మానించారు. గ్రామంలో ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో కీలకమని, ప్రజల సహకారంతోనే శుభ్రమైన గ్రామాన్ని నిర్మించవచ్చని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.
గ్రామ సెక్రెటరీ భూమిక మాట్లాడుతూ, ఇలాంటి శుభ్రత కార్యక్రమాలను తరచుగా నిర్వహించి గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొని సహకారం అందించారు.
సర్పంచ్ బలరాం మాట్లాడుతూ, అనారోగ్యంతో ఉన్నవారికి ప్రతిక్షణం చాలా విలువైనది, ప్రాథమిక చికిత్స అత్యవసరం, అందుకే ప్రభుత్వం పంచాయతీలకు పల్లె దావఖానా లను తీసుకువచ్చింది. పెరుగుతున్న అనారోగ్యాల దృష్ట్యా ఆసుపత్రులు ప్రజలకు అందుబాటులో ఉండే అవశ్యకత ఎక్కువగా ఉంది. నంద తండా పంచాయతీకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తీసుకురావాలి లేదా పల్లె దవఖానాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా అభివృద్ధి చేసేల కార్యాచరణ చేయాలనీ సెక్రటరీ భూమిక, డాక్టర్ వెంకటేష్ లతో చర్చలు జరిపామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు ఏఎన్ఎం నర్సులు, రక్త పరిక్ష కేంద్రం, వాక్సిన్ లు, మందులు, 1 అంబులెన్సు, నాలుగు పడకలు మరియు సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. పంచాయతీ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకున్న సర్పంచ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తప్పక తీసుకువస్తానని హామీ ఇచ్చారు.

# లేడిస్ క్లబ్ ఆద్వర్యంలో బొమ్మల కొలువు









చర్చ,గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ వన్ ఏరియా ఇల్లందు క్లబ్ లో శుక్రవారం లేడిస్ క్లబ్ అధ్యక్షరాలు అనిత లలిత్ కుమార్ ఆద్వర్యంలో బొమ్మల కొలువు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ సతీమణి ఎల్.వి. మాలతి సూర్యనారాయణ , డైరెక్టర్ ఇఅండ్ యం తిరుమల్ రావు, సంస్థ డైరెక్టర్స్ కె విజయ లక్ష్మి వెంకటేశ్వర్లు, పద్మ తిరుమల రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ సందర్బంగా ముఖ్య అతిథులు మాటాడుతూ బొమ్మల కొలువు సంస్కృతి సంప్రదాయం ఉట్టి పడేలా ఉందన్నారు. పల్లెటూరి వాతా వరణాన్ని సృష్టించి పూర్వపు చరిత్రని నేటి తరానికి తెలిసేలా ఏర్పాటు చేసిన కుటీరం, మంచే, సంక్రాతి సంబురాలలో ఏర్పాటు చేసే , చుట్టు ప్రక్కల పల్లెటూరి వాతావరణం, చేదబావి, సమ్మక్క సారక్క సంస్కృతి అనే వివిధ రకాల బొమ్మలతో పలు అంశాలపై అవగాహన కలిగేలా బొమ్మలను ఏర్పాటు అబినందనీయమన్నారు. అలాగే తెలంగాణ సాంస్కృతీ సాంప్రదాయాల పురాతన పనిముట్లు, ప్రత్యేక ఆకర్షణగా ధనుర్మాసం సందర్బంగా దశవతారాల వేష దారణలు, వివిధ అలంకారాలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్బంగా లేడీస్ క్లబ్ సభ్యులు ఆధ్యాత్మికతతో ఏర్పాటు చేసిన దశావతారాల థీమ్ బొమ్మల కొలువు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జియంలు డి. లలిత్ కుమార్ , మధుసూదన్, క్వాలిటీ జియం సుజోయ్ మజుందర్, రెస్క్యు జియం శ్రీనివాస రెడ్డి, , త్రిప్తి అంబర్ కిషోర్ జా, ఎయల్ పి , ఇతర ఏరియాల జియంల సతిమణులు బి వనజ వెంకటయ్య, ఎస్ తిరుమల, సుప్రియ సుజోయ్ మజుందర్, కె వాణి శ్రీనివాస రెడ్డి, ఎన్ అలివేణి సుధాకర రావు, ఉమ శ్రీనివాస్, వెంకటలక్ష్మి నాగేశ్వ రరావు, సునీత రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మి రఘు కుమార్ మరియు గనులు డిపార్ట్మెంట్ అధికారులు, లేడీస్ క్లబ్ సెక్రటరీ శిరీష చంద్రశేఖర్, క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 2026 పరీక్షలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రశాంతంగా నిర్వహణ: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ లో 2026 పరీక్షల సెషన్ శాంతియుత మరియు సజావుగా నిర్వహించబడ్డాయి. ఈ కేంద్రానికి మొత్తం 100 మంది అభ్యర్థులకు పరీక్ష రాయడానికి అవకాశం కల్పించబడినప్పటికీ, 78 మంది అభ్యర్థులు హాజరయ్యారు, 22 మంది గైర్హాజర య్యారు. జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ తెలిపారు, "పరీక్షలు సక్రమంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రారంభమై, విజయ వంతంగా కొనసాగాయి. పరీక్ష కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థుల సౌకర్యాల కోసం తగిన అన్ని ఏర్పాట్లు చేపట్టబడ్డాయి."పరీక్ష నిర్వహణలో సిబ్బంది, అధికారులు మరియు పాఠశాల సిబ్బంది సమన్వయంగా పని చేశారు, తద్వారా అభ్యర్థులు ప్రశాంతంగా, విధానాలను పాటిస్తూ పరీక్షలలో పాల్గొనగలిగారు.

# నేత్రదాత కుటుంబాన్ని సత్కరించిన సదాశయ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు



చర్చ,గోదావరిఖని: ఎన్టీపీసీ నర్రశాలపల్లికి చెందిన జర్నలిస్ట్ సోదరులు మామిడి కుమారస్వామి, సత్యనారాయణ ల తండ్రి మామిడి రాయలింగు ఇటీవల మరణించగా, ఆయన కుటుంబ సభ్యులు గొప్ప నిర్ణయం తీసుకుని నేత్రదానం చేశారు. దీంతో ఇద్దరికి చూపు ప్రసాదించిన కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం వారి నివాసంలో నేత్రదాత రాయలింగు సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్, రామగుండం, కమాన్పూర్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. నేత్రదాత భార్య లక్ష్మి, కూతురు రేణుక, కుమారులు కుమారస్వామి, సత్యనారాయణలను అభినందిస్తూ సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డి. మాధవరావు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవు బలయ్య యాదవ్ సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ "అన్ని దానాల్లోకెల్లా నేత్రదానం అత్యంత గొప్పదన్నారు. ఒకరి మరణం ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపడం మహా పుణ్యం. ఇటువంటి నిర్ణయం తీసుకున్న మామిడి రాయలింగు కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి" అని కొనియాడారు. మరిన్ని కుటుంబాలు కూడా నేత్రదానం వైపు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రమణా రెడ్డి, బీజేపీ రామగుండం నియోజక వర్గ ఇంచార్జి కందుల సంధ్యరాణి, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఎథిక్స్ కమిటీ సభ్యులు పందిళ్ళ శ్యామ్ సుందర్, ప్రెస్ క్లబ్ కోశాధికారి రాజ్ కుమార్, జర్నలిస్టులు జక్కం సత్యనారాయణ, డి.చంద్రశేఖర్, బైరం సతీష్, రవి, రఘు, దబ్బేట శంకర్, సాగర్, నాగరాజు, కెనడి, చారి, కృష్ణ, శివ, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి రఘురామ్ తోపాటు మాజీ కౌన్సిలర్ కల్వచర్ల క్రిష్ణవేణి, కాంగ్రెస్ నాయకుడు రహీం, సేవా సమితి సభ్యురాళ్ళు బిల్లా శ్రీదేవి, రమ్యా యాదవ్ , స్వప్న, శైలజ, స్వరూప పాల్గొన్నారు.

# వనమా రాఘవేంద్రరావు వల్ల ప్రాణహాని ఉంది భూక్యా చెందు నాయక్

- అధికారులు సీరియస్‌గా తీసుకొని న్యాయం చేయాలన్న డిమాండ్



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం నియోజకవర్గం, పాల్వంచ పట్టణం, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు భూక్యా చెందు నాయక్ తనకు వనమా రాఘవేంద్రరావు వల్ల ప్రాణహాని ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన తనను ఇంటికి పిలిపించి కుల పరంగా అవమానించడంతో పాటు బెదిరింపులకు గురిచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వనమా రాఘవేంద్రరావు తన నివాసానికి పిలిపించి, తన వర్గీయులతో కలిసి టికెట్ల అంశంపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఎట్టి పరిస్థితుల్లోనూ కార్పొరేషన్ టికెట్ రాదని, గతంలో ఇతర నాయకుల వద్ద పనిచేశావని చెబుతూ అవమానించారని ఆరోపించారు."నీవు పార్టీలో ఉన్నా లేకపోయినా మా మాటే శాసనం" అంటూ తనను బెదిరించారని, లంబాడీ కులాన్ని అవమానిస్తూ బూతులు తిట్టారని భూక్యా చెందు నాయక్ తెలిపారు. తనను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రాణాంతక హెచ్చరికలు చేసినట్లు చెప్పారు.
వనమా రాఘవేంద్రరావుకు లంబాడీ కులంపై వివక్ష ఉందని, తన స్వార్థ రాజకీయాల కోసం పార్టీ కోసం పనిచేసే వెనుకబడిన వర్గాల నాయకులను అవమానిస్తున్నారని ఆరోపించారు. వనమా గత చరిత్రను పరిశీలిస్తే హింసాత్మక ఘటనలు ఉన్నాయని, అదే తరహా ప్రమాదం తనకు ఏర్పడుతుందేమోనని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రభుత్వ అధికారులు, పోలీస్ శాఖ సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపి, బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని త్వరలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సంక్రాంతి అనంతరం లంబాడీ సోదరులతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పారు.

# ప్రజల సూచనల మేరకు గోదావరి నది హారతి ఈ వారం నుంచి ప్రతి ఆదివారం : జిల్లా కలెక్టర్

- జనవరి 11న భద్రాచలం గోదావరి నది హారతి కార్యక్రమం



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: ఏరు ది రివర్ ఫెస్టివల్‌లో భాగంగా భద్రాచలంలో గోదావరి నది హారతి కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రజలు, భక్తులు, పండితుల నుంచి వచ్చిన సూచనలు, విన్నపాలు మరియు సలహాలను పరిగణలోకి తీసుకొని, గత వారం ముందుగానే ప్రకటించినట్లుగా ఈ వారం నుంచి ప్రతి ఆదివారం నది హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.గత రెండు శనివారాలలో భద్రాచలం గోదావరి ఘాట్ వద్ద నిర్వహించిన నది హారతి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. ప్రజల సౌకర్యం, స్థానిక సంప్రదాయాల పరిరక్షణ, అలాగే కార్యక్రమానికి మరింత విస్తృత భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో గోదావరి నది హారతి కార్యక్రమాన్ని ఇకపై ప్రతి ఆదివారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.
గోదావరి నది ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, నది పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ కార్యక్రమం
ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని గోదావరి నది సంరక్షణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం : భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- తెలంగాణకు రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటాం
- డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు పూర్తిచేస్తే ఈ ఏడాదిలోనే కొన్ని నియోజకవర్గాలకు సాగునీరు : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గోదావరి, కృష్ణ నదుల నుంచి రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటామని ఆయన అన్నారు.శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం గండుగులపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగవ పంప్ హౌస్ పనుల పురోగతిని, అలాగే మొత్తం ప్రాజెక్టు పనుల స్థితిగతులపై భారీ నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక వివరాలను మంత్రులకు వివరించారు.అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పురోగతిపై స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించామని తెలిపారు. గోదావరి నదిలో తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 968 టీఎంసీల నీటి వాటా కేటాయించబడిందని, నీటి లభ్యత 75 శాతం దాటిన తర్వాత సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు లభించాయని చెప్పారు. తాగునీటి అవసరాలను కూడా ప్రత్యేకంగా లెక్కగట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో పూర్తయ్యే అవకాశమున్న సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.19,324 కోట్ల వ్యయంతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 6 లక్షల 74 వేల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించనున్నట్లు తెలిపారు.
భూసేకరణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని వచ్చే ఆరు నెలల్లో భూసేకరణ కోసం రూ.5,000 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. భూసేకరణ పూర్తయిన వెంటనే రైతులకు ఎలాంటి ఆలస్యం లేకుండా పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో గోదావరి, కృష్ణ నదులపై తెలంగాణకు రావలసిన నీటి వాటా పరిరక్షణ కోసం అన్ని స్థాయిల్లో సమర్థవంతమైన పోరాటం కొనసాగుతోందన్నారు. కృష్ణ వాటర్ ట్రిబ్యునల్, కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సహా అన్ని వేదికలపై తెలంగాణకు రావలసిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని స్పష్టం చేశారు.
అదేవిధంగా పోలవరం--నల్లమల్ల సాగర్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణకు నష్టం కలిగించే ఏ అంశాన్నీ అంగీకరించబోమని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత బోర్డులకు, సుప్రీంకోర్టుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను తెలియజేశామని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగే వరకు, రాష్ట్రానికి రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకునే వరకు ప్రభుత్వం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, మొదటి ప్రాధాన్యంగా పినపాక, కొత్తగూడెం, అశ్వరావుపేట, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు పూర్తిచేస్తే, ఈ ఏడాదిలోనే కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిన విధంగా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణానికి సుమారు రూ.4,000 కోట్ల రివైజ్డ్ అంచనాలకు అనుమతి లభించడంతో, టెండర్లు, బిల్లుల ప్రక్రియలు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. గతంలో కేవలం మెయిన్ కెనాల్‌కే అనుమతులు ఉండటంతో డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ప్రాజెక్టులో భాగంగా లేవని గుర్తు చేశారు. మంత్రుల స్థాయిలో నిరంతర ఒత్తిడి తీసుకురావడం వల్ల మొదటి మూడు పంప్ హౌసులు ప్రారంభానికి రావడంతో పాటు, 18 లింక్ కెనాళ్లు, రాజీవ్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీళ్లు అందించే స్థాయికి పనులు చేరుకున్నాయని తెలిపారు. దీని ద్వారా ఇప్పటికే కొంత స్థిరీకరణ సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందన్నారు.ఈ ఏడాది జూన్--జూలై నాటికి సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తిచేసి సత్తుపల్లి మండలాలకు నీళ్లు అందించాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేయాలని సూచించారు. వచ్చే ఏడాదికి సంబంధించి నాలుగవ పంప్ హౌస్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లను కూడా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో సత్తుపల్లి ట్రంక్, నాలుగవ పంప్ హౌస్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ను కోరారు.అదేవిధంగా జూలూరుపాడు పనులు పూర్తిచేసి పాలేరు నియోజకవర్గానికి లింక్ కెనాల్ ద్వారా నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఎన్టీఆర్ కెనాల్ లింక్ కెనాల్ పనులు పూర్తైతే సత్తుపల్లి నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పనుల సందర్భంగా రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే మంత్రులు, జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకుని భూసేకరణ సమస్యలు లేకుండా పరిష్కరించాలని శాసనసభ్యులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, శాసనసభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆలస్యం లేకుండా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.
అనేక పని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ సీతారామ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఈ సమీక్ష సమావేశానికి హాజరైన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనసభ్యుల తరఫున, జిల్లా ప్రజల తరఫున, రైతాంగం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్,
అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్‌తో పాటు భారీ నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖలకు చెందిన
సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో స్నేహభావం.. శారీరక దారుఢ్యం

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సర్దాపూర్ 17వ బెటాలియన్ లో వార్షిక స్పోర్ట్స్ మీట్ పోటీలు
- విజేతలకు బహుమతులు అందింపు.. అభినందన





చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- క్రీడలు స్నేహభావంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహద పడుతాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ 17వ బెటాలియన్ లో వార్షిక స్పోర్ట్స్ మీట్ పోటీలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. 100, 200, 400, 800, 5 కిలోమీటర్ల పరుగు పందెం, క్రికెట్, వాలీబాల్, షెటిల్, క్యారం, చెస్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం ముగింపు పోటీలు నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. అనంతరం 100 మీటర్ల పరుగు పందెం, టగ్ ఆఫ్ వార్ పోటీలను ఇంచార్జి కలెక్టర్, బెటాలియన్ కమాండెంట్ సురేష్ తో కలిసి ప్రారంభించారు. 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి తిరుపతి, రెండో బహుమతి శ్రీహరి, మూడో బహుమతి సురేష్ నిలిచారు. టగ్ ఆఫ్ వార్ పోటీల్లో కంపెనీ ఏ జట్టు, ఎస్డీఆర్ఎఫ్ జట్లు రెండు రౌండ్లలో హోరాహోరీగా తలపడ్డాయి. రెండు రౌండ్లలో ఎస్డీఆర్ఎఫ్ జట్టు మంచి టీం వర్క్, సరైన పట్టుతో విజయం సాధించింది. విజేతలకు ఇంచార్జి కలెక్టర్, బెటాలియన్ కమాండెంట్ బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. వార్షిక క్రీడలు రోజువారి ఒత్తిడిని దూరం చేస్తాయని, ఉద్యోగుల అందరి మధ్య స్నేహభావం, జట్టుగా ఎలా గెలుపు సాధించాలి అనే విషయాలకు దోహదం చేస్తాయని తెలిపారు. ఆటలతో శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఫిట్ నెస్ ఎంత కీలకమో ఆటలు ఆడడం ద్వారా తెలుస్తుందని, రోజు యోగా, వ్యాయామం, నడక ఏదైనా తప్పనిసరిగా చేయాలని సూచించారు. తాను 2019లో ఐపీఎస్ గా ఎంపిక అయి శిక్షణ తీసుకున్నానని, ఇక్కడ ఉన్న అందరినీ చూస్తే తాను నేర్చుకున్న అంశాలు అన్ని గుర్తుకువస్తున్నాయని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఫిట్ నెస్, క్రమశిక్షణ తదితర అంశాలు నిత్య జీవితంలో ఉత్తమ ప్రతిభ చూపేందుకు ఉపయో గాగపడ తాయన్నారు. పోలీస్ ఉద్యోగం, డ్రెస్ కోడ్ అనేది క్రమశిక్షణ, సేవ భావం, ప్రజల భద్రతకు తాము ఉన్నామనే భావన కలిగిస్తుందని తెలిపారు. బెటాలియన్, ఎస్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వరదలు వచ్చినప్పుడు బాధితుల రక్షణ, సురక్షిత ప్రాంతాలకు తరలింపు, ఎన్నికల బందోబస్తు, జాతరల వద్ద ఎంతో విలువైన సేవలు అందిస్తున్నారని ఇన్చార్జ్ కలెక్టర్ కొనియాడారు.

# ఎన్నికలకు ముందు ఇచ్చిన వెల్ఫేర్ బోర్డు హామీ తక్షణమే అమలు చేయాలి:సీఐటీయూ"

- ఆల్ హమాలీల ప్రదర్శన,ధర్నా"
- నాయబ్ తహశీల్దార్ బంతిరాం కు వినతి...






చర్చ, సత్తుపల్లి:ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఫెడరేషన్ పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మంజిల్లా వేంసూరు మండల కేంద్రంలోని ఎర్ర రామయ్య భవనం నుండి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల కమిటి సభ్యులు ప్రదర్శనగా వెళ్లి ధర్నా చేసి నాయబ్ తహశీల్దార్ బంతి రామ్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు. జిల్లా కలక్టర్ కు వినతి పత్రాన్ని పంపిస్తామని బంతిరామ్ హామీ ఇచ్చారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి,ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మానిఫెస్టో లో పెట్టిన మరియు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో గల ఆల్ హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఐకెపి,సహకార సంఘాల ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పని చేసే హమాలీ కార్మికులకు రైతులతో సంబంధం లేకుండా వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలని, టన్నుకు మోకు మామూలు 100 రూపాయల చొప్పున ఇచ్చేలా చేయాలని,అర్హులైన వారికి ఇండ్లు,ఇండ్ల స్థలాలు,రేషన్ కార్డులు రాజకీయాలకతీతంగా ఇవ్వాలని,50 ఏళ్లు నిండిన హమాలీ కార్మికులకు ఆసరా పింఛనుతో సంబంధం లేకుండా నెలకు 5 వేలు చొప్పున పింఛను ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు మల్లూరు తెలిపారు.ఈ కార్యక్రమంలో: సీఐటీయూ అనుబంధ ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు పురేటి సుగుణరావు,చెన్నారావు,నాగేశ్వరరావు,శ్రీనివాసరావు,కృష్ణ,గోపిం రాజు,రమేష్,వీరయ్య,నాగరాజు,సాయిరాంబాబు లతో పాటు మరో 27 మంది ఆల్ హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలి

- సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నెలలో 100 ఇండ్లు ప్రారంభానికి సిద్ధం చేయాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల 8 వార్డ్ లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డ్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. వార్డ్ లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులతో ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. ఇల్లు ఎప్పుడు మొదలు పెట్టారు? ప్రభుత్వ సహాయం అందుతుందా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 808 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, వాటిలో 554 ఇండ్లకు ముగ్గు పోశారని, 461 ఇండ్లు బేస్ మెంట్ లెవెల్, 326 గోడల లెవెల్ లో, 250 స్లాబ్ లెవెల్ లో ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ వెల్లడించారు. ముగ్గు పోసుకున్న వారితో ఇండ్ల పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో స్లాబ్ లెవెల్ లో ఉన్న ఇండ్లలో ఈ నెలలో 100 పూర్తి చేసి, గృహ ప్రవేశానిక్ సిద్ధం చేయాలని ఆదేశించారు. లబ్దిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని, నూతన గృహ ప్రవేశానికి తాను హాజరు అవుతానని తెలిపారు. మున్సిపల్, హౌసింగ్, వార్డ్ అధికారులు ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని నిత్యం పరిశీలించాలని సూచించారు. లబ్దిదారులకు ఇటుకలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా సరైన ధరకు వచ్చేలా హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ం ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. పరిశీలనలో హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# నేనే రాజు.. నేనే మంత్రి అన్నట్లుగా రెవెన్యూ అధికారుల వైఖరి

- సుజాతనగర్‌లో వారసత్వ పట్టాల అక్రమ మార్పులు చట్టాలకే సవాల్
- రికార్డులు లేవంటూ బాధితుడికి దురుసు సమాధానం
- కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే ఆన్‌లైన్‌లో పేరు నమోదు




చర్చ, సుజాతనగర్:వారసత్వ భూముల విషయంలో కఠిన చట్టాలు ఉన్నా, వాటిని తుంగలో తొక్కుతూ సుజాతనగర్ రెవెన్యూ కార్యాలయ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "నేనే రాజూ నేనే మంత్రి" అన్న ధోరణితో అధికారాలు దుర్వినియోగం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.ముత్తాత తాత తండ్రి తరం నుంచి వారసత్వంగా వస్తున్న భూమికి సంబంధించి అసలు లాండ్ డాక్యుమెంట్లు చూపించి, ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది కావాలనే ఆలస్యం చేస్తూ, వెనుకడుగు వేస్తున్నారని బాధిత కుటుంబం వాపోతోంది.కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే పట్టాల మార్పు?వారసత్వ భూములను ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయాలంటే కుటుంబ సభ్యులందరి అంగీకారం (ఎన్ఓసి) తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది.అయితే, ఈ కేసులో మాత్రం కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే, ఫేక్ డాక్యుమెంట్ల ఆధారంగా వారసత్వ పట్టాలను ఆన్‌లైన్‌లో ఎక్కించినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.ఇది కేవలం పరిపాలనా తప్పిదం మాత్రమే కాకుండా, చట్టవిరుద్ధ చర్య,రికార్డుల తారుమారు, ప్రజా విశ్వాసానికి భంగంగా న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.సమాచారం అడిగితే "మీరే వచ్చి రికార్డులు వెతుక్కోండి"వారసత్వ పట్టాలను ఎవరి అనుమతితో మార్చారన్న సమాచారాన్ని కోరగా,రెవెన్యూ అధికారులు "రికార్డులు లేవూ మీరే వచ్చి వెతుక్కోండి" అంటూ బాధితుడికి దురుసుగా సమాధానం చెప్పినట్టు తెలుస్తోంది.ఆర్.టి.ఐప్రకారం చట్టానికి విరుద్ధం,ప్రజాసేవా నియమావళికి విరుద్ధం అధికారుల, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని న్యాయవాదులు వ్యాఖ్యానిస్తున్నారు.అసలు చట్టం ఏమంటోంది?

**తెలంగాణ రెవెన్యూ చట్టాల ప్రకారం:**

వారసత్వ భూముల మార్పులకు అన్ని వారసుల సమ్మతి తప్పనిసరిఫేక్ డాక్యుమెంట్లతో ఎంట్రీ చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చుసంబంధిత అధికారులపై డిసిప్లినరీ యాక్షన్, సస్పెన్షన్, విజిలెన్స్ విచారణ జరిపే అవకాశం ఉంది ఇలాంటి అక్రమాలు రుజువైతేఐపిసి సెక్షన్లు (420, 468, 471) రెవెన్యూ శాఖ సర్వీస్ రూల్స్వర్తిస్తాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.పెద్ద అవినీతి వ్యవహారమాలోతైన విచారణ అవసరంసుజాతనగర్ రెవెన్యూ కార్యాలయంలో ఇది ఒక్క కేసుకే పరిమితమాలేదా ఇదే తరహాలో మరిన్ని వారసత్వ భూములు అక్రమంగా మార్పులు చేశారాఅన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.జిల్లా కలెక్టర్ స్పందించాలి విజిలెన్స్ విచారణ చేపట్టాలి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి అని ప్రజా సంఘాలు, న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రశ్న మరియు సందేహం ఏమిటంటే,చట్టాలు పుస్తకాల్లో మాత్రమేనా? రెవెన్యూ కార్యాలయాల్లో "నేనే రాజు నేనే మంత్రి" పాలన నడుస్తుందా బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఈ అంశంపై పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

## కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఆకస్మిక సందర్శన



చర్చ, కరీంనగర్ ప్రతినిధి :- కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెధిర గ్రామ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయంలోని వంటగది, స్టోర్ రూమ్, తరగతి గదులను ఆమె పరిశీలించారు. స్టోర్స్ నిల్వలకు సంబంధించిన పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మెనూ అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం, ఇతర ఆహార పదార్థాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు, వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పరిశు భ్రమైన తాగునీరు అందించాలని సూచించారు. అపరిశుభ్ర వాతావరణంలో విద్యాలయం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేజీబీవీలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. ఫిర్యాదుల పెట్టెను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళా కానిస్టేబుల్ ఆధ్వర్యంలో ఫిర్యాదుల పరిశీలన ఉంటుందని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. సిలబస్, బోధించిన పాఠ్యాంశాలు తదితర వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షలకు సంసిద్ధంగా కావాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి ఉన్నారు.

## సంక్రాంతి సంబరాలు పురస్కరించుకున్న శ్లోక స్కూలు శ్లోక స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



చర్చ : ప్రతినిధి కుక్కునూరు :కుక్కునూరు: మండల కేంద్రంలో శ్లోక కాన్సెప్ట్ స్కూల్ నందు సంక్రాంతి సంబరాలను ఎంతో ఘనంగా నిర్వహించారు.శుక్రవారం అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో పండుగ సందడి ఉట్టిపడేలా స్కూల్ మేనేజ్‌మెంట్ ఏర్పాట్లను చేశారు. కాగా ఇందులో భాగంగా హరిదాసు, చిలక జోష్యం, గూడూరు బసవయ్య కళాకారులను సందడి చేస్తూ సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజెప్పారు. కాగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు, ఈ సంబరాల్లో భాగంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కాగా ఈ సంక్రాంతి సంబరాల్లో పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. సంక్రాంతి పండుగ సంబరాలలో పాల్గొన్న వారు కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముళిశెట్టి నాగేశ్వరరావు(నాగు) మాట్లాడుతూ.. ఇప్పటి పిల్లలకు సంక్రాంతి విశిష్టతను తెలియజెప్పేలా శ్లోక స్కూల్ యాజమాన్యం చేసిన కార్యక్రమం మెచ్చుకోదగినది అభినందించారు సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ,పేరుకు ఇంగ్లీష్ మీడియం స్కూల్ అయినా శ్లోక వారు తెలుగుదనం ఉట్టిపడే కార్యక్రమాలు నిర్వహించటం ప్రశంసనీయం అన్నారు. ఈ సంక్రాంతి పండుగ కుక్కునూరు మండలం జనసేన అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ తెలుగింటి వారికి పెద్ద పండుగ అని, సంక్రాంతి సంబరాలు ముందస్తు తెచ్చిన శ్లోక స్కూలు యాజమాన్యం వారికి ధన్యవాదాలు తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రరావు మాట్లాడుతూ... పిల్లలను ప్రోత్సహించేలా ప్రతి స్కూల్ ఇలాంటి కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ముప్పాల సాంబశివరావు, కోటగిరి సత్యనారాయణ, వనమా భాగ్యలక్ష్మి, కుక్కునూరు పంచాయతీ ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, గంజి రాంబాబు, బీజేపీ లక్ష్మణాచార్యులు, జనసేన సీతారామయ్య, గంధం నాగరాజు, కూరాకుల బాబూరావు, మాబూపాషా, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్లోక స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాల్వంచ నారాయణ పాఠశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:చిన్నారులకు భోగిపళ్ళు, ముగ్గుల పోటీలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, గాలిపటాలు, కోడిపందాల ప్రదర్శనతో పాఠశాల ప్రాంగణ మంతా పండుగ సందడి నెలకొం ది.పాల్వంచ: స్థానిక నెహ్రూ నగర్‌లోని నారాయణ పాఠశా లలో ముందస్తు సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంప్ర దాయ దుస్తుల్లో విద్యార్థి--విద్యార్థినులు పాల్గొని గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా కోడి పుంజులు, గోవులు, మేకలు, ధాన్యం, చెరకు గడలు, అరటి మట్టలు తదితర పల్లెల్లో ఉపయోగించే పనిముట్లు, వస్తువులను



ప్రదర్శనలో ఉంచి భావితరానికి మన సంస్కృతి--సంప్రదాయాలను పరిచయం చేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశీర్వాదాలు అందించారు. బాలురకు గాలిపటాల పోటీలు, బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆటపాటలు ప్రేక్షకులను అలరించగా, పాఠశాల ప్రాంగణమంతా ఉత్సాహంతో సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, మకర సంక్రాంతి పండుగలో తొలి రోజు భోగి, రెండో రోజు సంక్రాంతి, మూడో రోజు కనుమగా జరుపుకుంటామని తెలిపారు. విద్యను సాంస్కృతిక విలువలతో మేళవించి రేపటి తరానికి తెలుగు పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందులో భాగంగానే నారాయణ పాఠశాలలో పాఠ్యప్రణాళికలో భాగంగా తల్లిదండ్రులు--విద్యార్థుల భాగస్వామ్యంతో ఈ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 21న రాజన్న కోడెల పంపిణీ

- చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- ఈ నెల 21వ తేదీన వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని 300 కోడెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు అర్హులని, అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువపత్రాలతో వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు
ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో ఈ నెల 21 వ తేదీన (బుధవారం) ఉదయం 09.00 గంటలలోగా వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలకు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకంతో రావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని, వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని సూచించారు. పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో 15 రోజుల హుండీ ఆదాయం



చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో గత 15 రోజుల కాలంలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం వివరాలను ఆలయ అధికారులు వెల్లడించారు. రూ.1,15,17,894/- నగదు రూపంలో ఆదాయంగా వచ్చినట్లు, మిశ్రమ బంగారం 32 గ్రాములు, మిశ్రమ వెండి 3 కిలోల 100 గ్రాములు వచ్చినట్లుగా తెలిపారు. హుండీ లెక్కింపు ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ ఏసీ ఆఫీస్ రాజమౌళి, ఆలయ ఇన్చార్జ్ ఏఆర్ ఇన్స్పెక్టర్ సురేష్, ఏఆర్ సబ్ ఇన్స్పెక్టర్ సాయికిరణ్ , పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్య నిర్వహణాధికారులు, అధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో పాటు రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ నుండి జిల్లా రాష్ట్రస్థాయిలో క్రికెట్ ఆడేలా శిక్షణ ఇస్తాం



చర్చ:- హుస్నాబాద్:హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధ్వర్యంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్, క్రీడా సామగ్రి పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి వెంకట నర్సయ్య,ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ క్రీడల్లోనూ హుస్నాబాద్ నియోజకవర్గం ముందుండాలి.యువజన క్రీడాశాఖ అధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గం లోని అన్ని మండలాలు ,గ్రామాలకు క్రికెట్ కిట్స్,క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నాంహుస్నాబాద్ పట్టణంలోని మున్సిపాల్టీ లో ఉన్న 20 వార్డుల్లో వార్డుకు ఒక క్రికెట్ కిట్ అందిస్తున్నాం.వారు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి.హుస్నాబాద్ నుండి జిల్లా ,రాష్ట్ర స్థాయిలో క్రికెట్ ఆడేలా శిక్షణ ఇస్తాంఇప్పటికే కబడ్డీలో రాష్ట్ర స్థాయిలో మన ప్రాంతం మంచి గుర్తింపు సాధించింది అందుకు అనుగుణంగా కబడ్డీ అకాడమీ అడుగుతున్నాంత్వరలోనే హుస్నాబాద్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నాంక్రీడలకు హుస్నాబాద్ అడ్డగా మారాలిక్రీడల అభివృద్ధికి సహాయ సహకారాలు ఉంటాయి ఇది వాడుకోవాలి ఎవరు స్వంత ఆస్తిగా భావించవద్దు.

## జర్నలిస్టు ను దూషించిన కాంగ్రెస్ నేత

- నిరసనగా జర్నలిస్టుల దర్నా
- పోలీస్ స్టేషనలో ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు



చర్చ,బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్టీవీ రిపోర్టర్ అందుగుల రమేష్ ను అకారణంగా దూషించి ,చంపుతామని బెదిరించిన మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ నాయకుడు కార్కూరి రాంచందర్ పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు , శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఎన్ టీ వి లో వచ్చిన ఒక కథనం పై బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ అందుగుల రమేష్ కు ఫోన్ చేసి ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ, చంపుతామని బెదిరించాడని ఆరోపించారు. రామచందర్ పై పోలీసులు కేసు నమోదు చేయాలని, జర్నలిస్టుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, ఈ ఘటనపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు లేనియెడల జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు పులియాల రాజు, ఉప్పులేటి లక్ష్మణ్, కోల వెంకటేష్ వికాస్ యాదవ్, తణుకు కృష్ణమూర్తి,కొలిపాకశ్రీనివాస్, మేకల భీమన్న దాసరి తిరుపతి ,బడుగు శ్రీనివాస్,ఇడి దివేని రాధాకృష్ణారావు, నగరం నిరంజన్, కలువల ప్రతాప్, మోసం శ్రీనివాస్, గరిగ వేణుగోపాల్,సాయికుమార్, తదితరులుపాల్గొన్నారు.అనంతరం రాంచందర్ పై బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్టేషన్ లో జర్నలిస్టులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత

- క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం
- సీఎం కప్-2025 టార్చ్ ర్యాలీ ప్రారంభం





చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- క్రీడా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాణించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. చీఫ్ మినిస్టర్ కప్- 2025 టార్చ్ ర్యాలీ కరీంనగర్లోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ స్టేడియం నుండి ప్రారంభమైంది. ఈ ర్యాలీని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సత్యం ప్రారంభించారు. తెలంగాణ చౌక్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. గతంలో క్రీడాకారులకు రాష్ట్రంలో ఎలాంటి అవకాశాలు ఉండేవి కావని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. ఈ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నదని, క్రీడాకారులకు అవకాశాలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నదని తెలిపారు. ఫుట్బాల్ దిగ్గజం మిస్సీతో ఫుట్బాల్ ఆడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల్లో, క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారని తెలిపారు. రాష్ట్రం నుండి అనేక మంది క్రీడాకారులు ఒలంపిక్స్ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని అన్నారు.క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. క్రీడా రంగానికి నిధులు వెచ్చిస్తూ, క్రీడా సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడా రంగానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో రాణించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కరీంనగర్ క్రీడాకారులు ఎన్నో మెడల్స్ సాధించారని తెలిపారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, జిల్లా యువజన అధికారి రాంబాబు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్, పడాల రాహుల్, సిద్ధారెడ్డి, యోగాసన సభ్యులు, ఒస్తుట సెక్రెటరీ, గ్రాజు, గ్రాజు లు, అసోసియేషన్ సభ్యులు, ప్రైవేట్గ్రాజు అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కోచ్ లు ,ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతంలో జాతీయ కబడ్డీ పోటీలు గర్వకారణం

- రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మూడో రోజు క్రీడలను తిలకించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి






చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం జిల్లాలో నిర్వహిస్తున్న 69వ ఎస్‌జీఎఫ్ అండర్--17 బాలుర జాతీయ కబడ్డీ పోటీలలో భాగంగా శుక్రవారం మూడో రోజు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు జరిగాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన జట్లు హోరాహోరీగా తలపడగా, క్రీడలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.మూడో రోజు క్రీడల్లో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతీయ కబడ్డీ పోటీలను వీక్షించేందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో మంత్రికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్తో కలిసి కబడ్డీ పోటీలను ఆసక్తిగా తిలకించారు.
ఈ సందర్భంగా మంత్రి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, “కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం క్రీడాకారుల జీవితంలో కీలకమైన మలుపు. గెలుపు, ఓటమి రెండింటినీ సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి” అని సూచించారు.అలాగే, “మారుమూల గిరిజన ప్రాంతమైన ఈ ప్రాంతంలో ఈ నెల 7వ తేదీన రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి జాతీయస్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా ప్రారంభించడం గర్వకారణం. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాల నుంచి 384 మంది క్రీడాకారులు, 74 మంది కోచ్‌లు, జడ్జీలు పాల్గొనడం ఈ పోటీల ప్రాధాన్యతను చాటుతోంది” అని మంత్రి తెలిపారు. ఈ పోటీలను ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా యంత్రాంగాన్ని, క్రీడా శాఖ అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, “పినపాక నియోజకవర్గంలోని ఏడూళ్ల బయ్యారం వంటి మారుమూల గిరిజన ప్రాంతంలో జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణ ఒక చారిత్రక ఘట్టం. ఈ పోటీల ద్వారా గ్రామీణ, గిరిజన యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహం వల్లే ఇలాంటి జాతీయస్థాయి పోటీలు మన ప్రాంతానికి వచ్చాయి” అని తెలిపారు.అలాగే, “ఈ కబడ్డీ పోటీలు స్థానిక యువతకు స్ఫూర్తిగా నిలిచి, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచే క్రీడాకారులు ఈ ప్రాంతం నుంచి ఎదుగుతారని ఆశిస్తున్నాను” అని ఎమ్మెల్యే అన్నారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ,“జాతీయస్థాయి క్రీడా పోటీలను మారుమూల గిరిజన ప్రాంతంలో ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా, అన్ని శాఖల సమన్వయంతో సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహిస్తున్నాం. క్రీడాకారుల భద్రత, వసతి, భోజనం, వైద్య సదుపాయాలు సహా అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, సర్పంచ్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## మరణానంతరం కూడా వెలుగులు పంచిన న్యాయవాది..

- నేత్రదానంతో చూపూ దేహదానంతో జ్ఞానం
- అడ్వకేట్ గోసిక ప్రకాష్ సేవా వారసత్వం



చర్చ,గోదావరిఖని:మనిషి జీవితానికి ముగింపు ఉంటుంది.. కానీ అతని ఆలోచనలకు, సేవా భావానికి మాత్రం అంతం ఉండదు.. ఈ మాటలకు సజీవ ఉదాహరణగా నిలిచారు గోదావరిఖనిలో సీనియర్ న్యాయవాది గోసిక ప్రకాష్.
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ప్రకాష్ ఇటీవల గుండెపోటుతో గోదావరిఖనిలో మృతి చెందారు. ఈ వార్తతో న్యాయవాద వర్గాలు, గ్రామస్తులు, మిత్రబంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషాదంలోనూ ఆయన కుటుంబం తీసుకున్న ఒక గొప్ప నిర్ణయమే ప్రకాష్ మరణానంతరం కూడా సమాజానికి వెలుగులు పంచే మహనీయుడిగా నిలిపింది.

### ఇద్దరికి చూపూ వందల మందికి జ్ఞానం

ప్రకాష్ కుటుంబ సభ్యులు ఆయన ఆశయాలకు అనుగుణంగా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించేలా నేత్రదానం.. వైద్య విద్యార్థుల పరిశోధన, శిక్షణ కోసం పార్థీవ దేహదానం చేశారు. ప్రకాష్ పార్థీవ దేహాన్ని సిమ్స్ మెడికల్ కాలేజీకి దానం చేయడం ద్వారా ఆయన ఇకపై కూడా వైద్య విద్యార్థులకు “మౌన గురువు”గా మారనున్నారు. చదువుతున్న వైద్య విద్యార్థులకు మానవ శరీర నిర్మాణంపై అవగాహన కల్పించే ప్రతి క్షణంలోనూ ప్రకాష్ సేవా ఆత్మ అక్కడే నిలిచి ఉంటుంది.

### ■ సేవే జీవితం న్యాయమే లక్ష్యం...

న్యాయవాదిగా బార్ అసోసియేషన్ ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రకాష్, సేవా కార్యక్రమాల పట్ల ఎప్పుడూ ఆసక్తి చూపేవారని సన్నిహితులు గుర్తు చేస్తున్నారు. జీవితం ఉన్నంత కాలం న్యాయానికి నిలబడిన ఆయనే మరణంలోనూ మానవత్వానికి మార్గదర్శకుడిగా నిలిచారు.

### ■ సంస్మరణ సభలో సేవా సంకల్పానికి నివాళి...

ఈ మహనీయుని సేవలను స్మరించుకుంటూ శుక్రవారం ప్రకాష్ నివాసంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభను సదాశయ ఫౌండేషన్, కమాన్పూర్, రామగుండం లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు, జిల్లా గౌరవ అధ్యక్షుడు లగిశెట్టి చంద్రమౌళి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, తెలంగాణ మహిళా విభాగం కన్వీనర్ చందాల శైలజ మాట్లాడుతూ నేత్ర, అవయవ, శరీర దానాలు సమాజానికి అత్యవసరమని, ప్రకాష్ సేవా దృక్పథం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.

### ■ గొప్ప మనసుకు ఘన సత్కారం...

న్యాయవాదిగా న్యాయాన్ని బోధించిన ప్రకాష్.. మరణానంతరం కూడా మానవత్వాన్ని బోధిస్తున్నారు. ఇద్దరికి చూపూ వందల మందికి జ్ఞానమే ఇదే ఆయన చిరస్మరణీయ సేవా వారసత్వం. ప్రకాష్ ఆశయాలను గౌరవిస్తూ ఈ సేవా నిర్ణయానికి అంగీకరించిన తల్లి మల్లమ్మ, భార్య సునీత, కుమారుడు విజయ్ వర్షిత్, కుమార్తె నివేదితను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా అభినందించి అభినందన పత్రాన్ని అందజేశారు. సేవలోనే చిరంజీవితం ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నూతి సురేష్ కుమార్, రఘుపతి గౌడ్, రఘురామ్, ప్రకాష్ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, న్యాయవాదులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళు లర్పించారు.

# భారత్ దిగుమతులు పై 500 శాతం సుంకం అమెరికా విధింపు బిల్లు

- వెనుజులా అధ్యక్షుడు ను అపహరించి అమెరికా లో బంధించడం
- ప్రపంచ దేశాల పై అమెరికా చేస్తున్న బలవంతం సుంకాలు, మిలటరీ దాడులను భారత్ ఎదిరించాలి
- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఖాజా రాధాకృష్ణమూర్తి 20 వర్ధంతి సభ లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు
- రైతాంగ సాయుధ పోరాటంలో గండగలపాడు కు ఘన చరిత్ర
- సిపిఎం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చా మణి



చర్చ:వైరా : ప్రపంచ దేశాల పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో, మిలటరీ దాడులు, సుంకాలు విధింపు లతో లొంగదీసుకున్ని తమ దేశం అధిపత్యం నిలుపుకోవడం కోసం చేస్తున్న అన్ని రకాల చర్యలను భారత ప్రభుత్వం సమర్థవంతంగా తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని నరేంద్ర మోడీ విదేశీ వ్యవహారాల్లో అనుసరిస్తున్న వైఖరి భారతదేశానికి ప్రమాదంగా దాపురించే అవకాశం ఉందని మన దేశ ప్రయోజనాల కోసం అలీన ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన సందర్భంలో భారత్ ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఖాజా రాధాకృష్ణమూర్తి 20 వర్థంతి సిపిఎం గ్రామ శాఖ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు బిమచ్చా మణి మాట్లాడుతూ అమెరికా ఒత్తిడికి లొంగి పత్తి దిగుమతి సుంకం ఎత్తివేయడంతో భారతదేశ రైతాంగానికి తీరని నష్టం జరిగిందని భారత మార్కెట్లో పత్తి ధరలు పడిపోయాయని అన్నారు అమెరికా నుంచి పత్తితో పాటు పాలు మొక్కజొన్న గోధుమ బియ్యం దిగుమతులకు ఒత్తిడి చేస్తున్నారని భారత ప్రభుత్వం అంగీకరించడం లేదని రష్యా నుంచి పెట్రోలియం ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు అనే నెపంతో 500% సుంకాలు భారత నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులు పై విధించడం ద్వారా భారత దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయాలని అమెరికా వస్తుందని అన్నారు మరోవైపు అమెరికా పొరుగు దేశం వెనిజులాలో ఉన్న నాణ్యమైన పెట్రోలియం ఉత్పత్తులను కారుచౌకుగా అమెరికా కంపెనీలు దృుటీ చేసేందుకు ఆ దేశ అధ్యక్షుడు మధురో అడ్డంకి గా ఉన్నాడని భావించి అర్ధరాత్రి అధ్యక్ష భవనం పై మిలటరీ దాడి చేసి అధ్యక్షున్ని అతని భార్యని అపహరించి అమెరికాలో బంధించి ఖైదీ చేయడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పరుగు దేశాల యొక్క సార్వభౌమాధికారాన్ని నాశనం చేసేందుకు అమెరికా చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలతో కలిసి భారత ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన దక్షణ అవసరం ఏర్పడిందని అన్నారు తెలంగాణ సాయుధరహితంగా పోరాటం వలసవాదానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిందని ఆ పోరాట స్ఫూర్తితో నయా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. గండగలపాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అనేకమంది వీరులను అందించిన ఘనత చరిత్ర ఉందని అన్నారు, సిపిఎం సీనియర్ నాయకులు వాసిరెడ్డి విద్యాసాగర్ రావు గారు ఖాజా రాధాకృష్ణమూర్తి గారి స్తూపం వద్ద ఎర్రజెండా ఎగరేశారు కాజా కృష్ణ రాకేష్ రాధాకృష్ణమూర్తి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మల్లెంపాటి రామారావు, పల్లె బోయిన కృష్ణ ,దేవ భక్తున్ని నరసింహారావు. ఇమ్మడి వీరభద్రం, కిన్నెర మోతి, కామినేని రవి,ఇమ్మడి సుదీర్,మోటపోతుల వెంకటేశ్వరరావు , చిత్తారు మురళి, వెంపటి రాజా,మహేష్, గుంటుపల్లి కామలేశవరావు , బాబు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట



హైదరాబాద్, జనవరి 9: తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేయాలన్న పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా శివధర్‌రెడ్డిని డీజీపీగా నియమించారంటూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త టి.మధన్‌గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే విధించడానికి నిరాకరించింది. రెగ్యులర్ ప్రాసెస్‌ను 4 వారాల్లో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. యూపీఎస్‌సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.

# గడువు ముగిసినా నివాసయోగ్యపత్రం - కానీ షరతులు వర్తిస్తాయి



హైదరాబాద్, జనవరి 9: నిర్ణీత గడువులోపు నివాసయోగ్యపత్రం(ఓసీ) పొందలేకపోయిన భవనాలకు ఉపశమనం కల్పిం చడానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలను పాటించి ఇంటి నిర్మాణం చేపడితే ఆలస్యమైనా సరే ఓసీ జారీ చేయనున్నట్లు ఆయన వివరించారు. అందులో భాగంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల దరఖాస్తులను రెండు రకాలుగా విభజించి వాటికి సంబంధించి పలు మార్గదర్శకాలను గురువారం జారీ చేశారు. రెండు కేటగిరీల్లోనూ భవన నిర్మాణంలో ఉల్లంఘనలు గరిష్ఠంగా 10 శాతం మాత్రమే ఉండాలని, 18 మీటర్ల ఎత్తు వరకు అనుమతి తీసుకున్న భవనాలకు మాత్రమే ఈ నిర్ణయం వర్తించనుందని కర్ణన్ స్పష్టం చేశారు.మార్గదర్శకాలు ఇలా : భవన నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్ల లోపు ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే పెండింగులోని నిర్మాణ అనుమతి రుసుము, లింకు రోడ్డు ఛార్జీలు, సీఆర్ఎంపీ ఫీజు, ఇతరత్రా అన్నీ రకాల రుసుములతో వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్ల తర్వాత దరఖాస్తు చేసుకున్నట్లయితే దరఖాస్తు తేదీ నాటికి మొత్తం నిర్మిత విస్తీర్ణానికి వర్తించే అన్ని రకాల రుసుములు, ఛార్జీలు వసూలు చేస్తారు.నివాసయోగ్య పత్రం అంటే? ఇది భవనం సురక్షితమైనదేనని, మున్సిపల్ కార్పొరేషన్? నిబంధనలను పాటించి నిర్మించిందని తెలిపేసే పత్రం. దీనిని తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు పొందడానికి, మనకున్న ప్రాపర్టీని విక్రయించడానికి, రిజిస్ట్రేషన్ చేయడానికి ఇది తప్పనిసరిగా పరిగణిలోనికి తీసుకుంటారు.

# రైతన్నలకు గుడ్ న్యూస్ కొత్త పథకాలు ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 9 : గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన జీవిత లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు.(శుక్రవారం) అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో రైతు మేళా కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి వ్యవసాయ పథకాలను మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. దివంగత ఎన్టీఆర్ దీవెనలతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ డీపీఆర్‌లో లేదని ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశామని తెలిపారు.గోదావరి నీళ్లు వస్తాయి.బీఆర్ఎస్ పాలనలో మూలకిపడిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునఃప్రారంభోత్సవం చేశామని తెలిపారు. 350 మంది రైతులకు రూ.1.07 కోట్లు విలువైన యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పథకం ప్రారంభించినట్లు వివరించారు. వ్యవసాయ ఉద్యాన పామాయిల్ సాగుపై శాస్త్రవేత్తలు ఆదర్శ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించామని పేర్కొన్నారు. నాలుగో పంపు హౌస్ నిర్మాణంతో దమ్మపేట, అశ్వరావుపేట మండలాలకు గోదావరి నీళ్లు వస్తాయని వెల్లడించారు. ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కోకూ, జాజి, వక్క, మిరియం, సాగుతో రైతులకు అదనపు

# కేటీఆర్‌పై గజ్జెల కాంతం షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్, జనవరి 9: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పీసీసీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. దుబాయ్‌లో తన బినామీని చంపితే ఆధారాలు పోతాయని కేటీఆర్ భ్రమపడ్డారని గజ్జెల కాంతం ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల్లో కేటీఆర్ మకాం వేసేవారని తెలిపారు. 2022 జనవరి 24న ఒక హీరోయిన్‌కు కేటీఆర్ రూ.100 కోట్లు ఇచ్చారని.. ఒక కాంట్రాక్టర్, జ్యువెలరీ షాప్ యజమాని అకౌంట్ నుంచి ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించారని సంచలన వ్యాఖ్యలు చేశారు.హీరోయిన్‌ను బెదిరించి మరీ.ముంబైలోని తాజ్ కృష్ణా హోటల్ 328వ గదికి ఒక హీరోయిన్‌ను పిలిపించి, రూ.35 కోట్ల 75 లక్షలతో విల్లా కొనిచ్చారని, అది కారు కూడా బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. 2022 మార్చి 3న ఢిల్లీలోని లలిత్ హోటల్ 770వ గదికి.. మైసూర్‌అబ్రీశ్రీలో షూటింగ్ చేస్తున్న హీరోయిన్‌ను బెదిరించి పిలిపించుకున్నారని, రూ.50 కోట్లు ఇస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబం అమెరికాలో రూ.40 వేల కోట్లు, దుబాయ్‌లో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందన్నారు. దాదాపు 30 వేల ఎకరాల భూములు దోచుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇవన్నీ అబద్ధాలని తన కొడుకుపై ప్రమాణం చేయగలరా అని గజ్జెల కాంతం నిలదీశారు.రాహుల్ కాలి గోటికి సరిపోరు.కేసీఆర్‌కు ఎన్టీఆర్, చంద్రబాబు రాజకీయ భిక్ష పెట్టారని.. దొంగ పాస్‌పోర్టులు సృష్టించిన చరిత్ర కేసీఆర్‌దేనని గజ్జెల కాంతం విరుచుకుపడ్డారు. ఎన్నికల కోసం జగన్‌కు రూ. 200 కోట్లు.. మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, ఢిల్లీకి కోట్లాది రూపాయలను కేసీఆర్ పంపారన్నారు. అఖిలేష్ యాదవ్, కుమారస్వామికి కేటీఆర్ డబ్బులు పంపారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా, రాహుల్‌పై కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం వల్లే కేటీఆర్ మంత్రి అయ్యారని, రాహుల్ కాలి గోటికి కూడా కేటీఆర్ సరిపోరని వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందని, కేటీఆర్ కుటుంబం ఏం త్యాగం చేసిందని గజ్జెల కాంతం ప్రశ్నించారు. చట్టాలు, రాజ్యాంగంపై కేటీఆర్‌కు గౌరవం, జ్ఞానం లేదని, చరిత్ర తెలియదని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని.. కేటీఆర్ లాగా రాహుల్, రేవంత్‌లు దోచుకోలేదని గజ్జెల కాంతం పేర్కొన్నారు.

# చైనా మాంజా ప్రమాదం నాలుగేళ్ల చిన్నారికి తీవ్రగాయాలు



జగిత్యాల జిల్లా, జనవరి9 : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో గుండెలను పిండేసే ఘటన చోటుచేసుకుంది. నిషేధిత చైనా మాంజా మరొకరిని తీవ్రంగా గాయపరిచింది. గాలిపటంతో ఆడుకుంటున్న ఓ చిన్నారి మెడకు.. మాంజా చుట్టుకోవడంతో గొంతు తెగి తీవ్ర రక్తస్రావమైంది. ప్రస్తుతం ఆ బాలుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపడమే కాకుండా.. నిషేధిత మాంజా విక్రయాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది.దుబ్బవాడలో విషాదంమెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడ ప్రాంతానికి చెందిన శ్రీహాస్ (4) అనే బాలుడు తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో చైనా మాంజా ఒక్కసారిగా గొంతుకు చుట్టుకుంది. మాంజాను తీయబోతుండగా గొంతు తెగి తీవ్ర రక్తస్రావమైంది. గొంతు భాగంలో తీవ్రమైన గాయమవడంతో చిన్నారి గట్టిగా కేకలు వేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు రక్తపు మడుగులో ఉన్న బాలుడిని చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.విషమంగా ఆరోగ్యం.నిజామాబాద్ ఆస్పత్రిలో బాలుడికి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించారు. గొంతు భాగంలో లోతైన గాయం కావడంతో వైద్యులు దాదాపు 20 కుట్లు వేశారు. ప్రస్తుతం శ్రీహాస్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి పరిస్థితి ఇప్పటికీ విషమంగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ విషయం కుటుంబ సభ్యులు, స్థానికులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.చర్యలు తీసుకోవాలి మెట్‌పల్లిలో శ్రీహాస్ గాయపడిన ఘటన అందరినీ ఆలోచింపజేస్తోంది. పండుగ పూట ఇళ్లలో విషాదం నింపే ఇలాంటి చైనా మాంజాలను వెంటనే బహిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసులు వెంటనే స్పందించి మెట్‌పల్లి, పరిసర ప్రాంతాల్లో చైనా మాంజా విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సింగోటం జాతర ,బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి




కొల్లాపూర్ : నాగర్ కర్నూలు జిల్లా సింగోటంలక్ష్మనర్సింహస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఈనెల 15 నుంచి 21 వరకు కొల్లాపూర్, శ్రీలక్ష్మనరసిం హస్వామి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆలయాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ , అధికారులతో కలిసి సందర్శించిన సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు . ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ శాఖాధికారులను ఆదేశించారు. జాతరలో తాగునీటి, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం వంటి ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రాయలసీమ భక్తుల కోసం నందికొట్కూర్ కర్నూలు నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైతే సోమశిల, మంచాలకట్ట వద్ద టూరిజం శాఖకు చెందిన చిన్న బోట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.రథోత్సవం రోజున ప్రతి గ్రామం నుంచి బస్సు నడపాలని, కొల్లాపూర్ డిపో నుంచేగాక ఇతర ప్రాంతాల నుంచి అదనపు బస్సులు తెప్పించాలని సూచించారు.

# జీవించి ఉన్న మేక నుంచి రక్తం సేకరణ కేసు నమోదు




మేడ్చల్, జనవరి 9: జంతువుల నుంచి రక్తం సేకరణ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ వాణి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూగ జీవుల నుంచి రక్తం తీసేందుకు ఎలాంటి అనుమతి పొందలేదని పోలీసులు గుర్తించారు. సోను మటన్ అండ్ చికెన్ షాప్‌పై బీఎన్ఎస్ 223తో పాటు ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ ఆఫ్ యానిమల్స్ యాక్ట్ (పీసీఏఏ) కింద కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ వ్యవహారంపై వెటర్నరీ అధికారులు ఇచ్చిన నివేదికను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు.కాగా.. సోను మటన్ షాప్‌లో జీవించి ఉన్న మేక నుంచి రక్తం సేకరించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈనెల 4న నాగారంలోని సోను మటన్ షాపుపై కీసర పోలీసులు దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం లభించింది. మేకల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్‌కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్ పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్ లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ 'గోట్ బ్లడ్ మాఫియా' ఎటువంటి వైద్య ప్రమాణాలు పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్ లెట్ల తయారీకి తరలిస్తుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# క్యూలైన్లలో ఫ్యాన్లు నిమిషాల్లోనే దర్శనం



మేడారం: మేడారం ఖ్యాతి ఖండాంతరాలు దాటుతోంది. సమ్మక్క, సారల మ్మను దర్శించుకునేందుకు ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. అయితే మన రాష్ట్రం నుంచే కాకుం డా దేశ విదేశాల నుంచి భక్తులు రావడంతో దానికి అనుగుణ ంగానే ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. దీనికోసం భక్తుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించింది.వన దేవత సమ్మక్క సారలమ్మ మహా జాతరలో భక్తుల కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తోంది. దేవతల దర్శనం పూర్తయిన భక్తులకు ఇబ్బం దులు కలగకుండా ఉండేందుకు ఈసారి క్యూలైన్‌ల నిర్మాణం వినూత్నంగా చేపడుతున్నారు. పది నుంచి ఇరవై నిమిషాల వ్యవధిలోనే దర్శనం జరిగేలా రూ.3 కోట్లతో జరుగుతున్న క్యూలైన్ల నిర్మాణంపై ప్రత్యేక కథనం.తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో : ఇంత వరకు జాతర గద్దెల ప్రాంగణానికి కుడి, ఎడమ, వెనక వైపు క్యూలైన్లు ఉండేవి. కాగా ఈసారి కుడి వైపున్న వరుసలను తొలగించి స్మృతివనం నిర్మిస్తున్నారు. ఎడమ వైపు ఉన్న వాటన్నింటిని తొలగించారు. మొత్తం ఐదు వరుసలను నిర్మిస్తున్నారు. ఈ వరుసల్లో ప్రవేశించిన భక్తులు సమారు 750 మీటర్లు నడిచి, గద్దె ప్రాంగణానికి చేరుకుంటారు. మధ్య వరుసను పోలీసులు, వాలంటీర్ల కోసం వినియోగిస్తారు. దానికి కుడి వైపు ఉన్న రెండు, ఎడమ వైపు ఉన్న రెండు వరుసల్లో మాత్రమే భక్తులను అనుమతిస్తారు.వీటిపై నీడ కోసం తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో షెడ్లు నిర్మిస్తున్నారు. లైన్లలో వేచి ఉండే భక్తులు ఒత్తిడికి గురి కకుండా ఉండేందుకు ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. గతంలో భక్తులు ఒక వరుస నుంచి మరో వరుసలోకి వెళ్లేందుకు ఇనుప బొంగుల మధ్య కొంత స్థలం ఉండేది. ఈసారి అలాంటి అవకాశం లేకుండా ఏర్పాట్లు చేశారు.వీఐపీల కోసం ప్రత్యేకంగా : దేశం లోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులతో పాటు రాష్ట్రానికి చెందిన వేలాది మంది ప్రముఖులు దేవతలను దర్శించుకొనేందుకు మహా జాతరకు వస్తుంటారు. వీరందరికీ వీఐపీ దర్శనం అందేలా చేయడం అధికారులకు సవాల్?గా మారుతోంది. గతంలో వీఐపీల కోసం ప్రత్యేకంగా ఒక వరుస ఉండగా, పైరవీల కారణంగా తొలగించారు. ఈసారి మాత్రం మాస్టర్ ప్లాన్‌లో ప్రత్యేకంగా వీఐపీ వరుసను పక్కాగా ఏర్పాటు చేస్తున్నారు.సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న సాయంత్రం మేడారం వెళ్లనున్నారు. తర్వాత రోజు ఉదయం పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క ఇదివరకే వివరించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పనుల సమీక్షకు హాజరైన మంత్రులు పలు వివరాలను వెల్లడించారు. రూ.251 కోట్లతో జాతర ఏర్పాట్లు, సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణం జరుగుతోందని, పనులు తుది దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.మాజీ సీఎంకు ఆహ్వానం : మేడారం సమ్మక్క – సారలమ్మ మహా జాతరకు రావాల్సిందిగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్?ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు సీతక్క, కొండా సురేఖలు గురువారం ఆహ్వానించారు. ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మంత్రులను కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. మంత్రులు జాతర ఆహ్వాన పత్రికను ఆయన?కు అందజేశారు. తమ ఇంటికి విచ్చేసిన మహిళా మంత్రులకు కేసీఆర్? ఆత్మీయంగా స్వాగతం పలికారు. కేసీఆర్? – శోభ దంపతులు పసుపు, కుంకుమ, తలంబ్రాలు, వస్త్రాలతో సంప్రదాయ రీతిలో మంత్రులను సత్కరించారు. వారు అందించిన విందును స్వీకరించిన మంత్రులు, పరస్పర యోగాక్షేమాలు తెలుసుకుని హైదరాబాద్?కు బయలుదేరారు.

# వైసీపీ నాయకుడి కంకర మిషన్ మూసివేత




కదిరి(అనంతపురం): మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల సమీపంలో ఉన్న వైసీపీ నాయకుడు ప్రణీత్‌రెడ్డికి చెందిన శివసాయి కంకర మిషన్ (స్టోన్ క్రషర్ ఫ్యాక్టరీ)ను మూసివేస్తూ ఏపీ కాలుష్య నియంత్రణ మండలి గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఫ్యాక్టరీకి విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించింది. కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టలేదని 2024 జనవరి 26న ఈ ఫ్యాక్టరీని కాలుష్యనియంత్రణ మండలి మూసి వేసింది.దీనిపై యజమాన్యం హైకోర్టుకు వెళ్లి మూసివేతను ఆపింది. గత ఏడాది జూలై 28న విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ సంయుక్తంగా ఫ్యాక్టరీని తనిఖీచేశారు. కాలుష్య నియంత్రణ చర్యలు పూర్తిగా చేయలేదని ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కంకర ఫ్యాక్టరీని తక్షణం మూసివేయాలని ఉత్తర్వులిచ్చింది.ఒకవేళ డీజిల్ జనరేటర్‌తో కానీ, ఇతర యంత్రాలసాయంతోకానీ, ఫ్యాక్టరీలో పనులుచేస్తే, ఒకటిన్నర సంవత్సరం నుంచి గరిష్ఠంగా ఆరేళ్ల జైలు, జరిమానా ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శివసాయి కంకర మిషన్‌కు గురువారం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ట్రాన్స్‌కో డీఈ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు కరెంటు తొలగించామన్నారు.

# కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం



ఎన్టీఆర్ జిల్లా, జనవరి9 : ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయ భవనంలోని స్టోర్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కార్యాలయం లోపలి నుంచి భారీగా పొగలు రావడం గమనించిన సిబ్బంది. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది,సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.పలు రికార్డులు దగ్ధం.అగ్నిప్రమాదంలో స్టోర్ రూమ్‌లో భద్రపరిచిన పలు ప్రభుత్వ రికార్డులు కాలిపోయినట్లు ప్రాథమిక సమాచారం. అయితే ఏ రకమైన రికార్డులు, ఎంత నష్టం జరిగిందనే వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు.కారణాలపై దర్యాప్తు.ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా? లేక మరే ఇతర కారణాలున్నాయా? అనే విషయాలపై అధికారులు విచారణ చేపట్టారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.ఎలాంటి ప్రాణ నష్టం లేదు.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించే విషయం. అయితే ప్రభుత్వ రికార్డులు దగ్ధమవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.అధికారులు అప్రమత్తం.ఈ ఘటనపై రెవెన్యూ శాఖ, ఫైర్ శాఖ అధికారులు సమీక్ష చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# పెనుకొండలో ఇస్కాన్ బేస్ క్యాంప్




హిందూపురం(అనంతపురం): పెనుకొండలో ఇస్కాన్ సంస్థ ఆధ్యాత్మిక, సాంస్కృతిక బేస్ క్యాంప్ ఏర్పాటు కానుందని బీసీ సంక్షమ శాఖ మంత్రి సవిత తెలిపారు. రాజధానిలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఇస్కాన్‌కు స్థలం కేటాయించారని ఆమె తెలిపారు. రూ.425.20 కోట్లతో ఇస్కాన్ ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. )లోని లక్ష్మనరసింహస్వామి ఆలయం ఉన్న కొండపై ఇస్కాన్ టెంపుల్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక బేస్‌క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కేంద్రానికి రెండురోజుల క్రితం జరిగిన రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు సమావేశం పచ్చజెండా ఊపిందని తెలిపారు. మొత్తం 60 ఎకరాల విస్తీర్ణంలో ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేస్తారని మంత్రి వివరించారు. ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతి బేస్‌క్యాంప్ ఏర్పాటుతో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా పెనుకొండ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దేశ విదేశాలకు చెందిన భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు.ఈ బేస్ క్యాంప్ ఏర్పాటుతో 1035 మందికి ప్రత్యక్షంగా 3 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. త్వరలోనే బేస్‌క్యాంప్ ఏర్పాటు పనులు ప్రారంభమౌతాయని తెలిపారు. పెనుకొండకు ఖ్యాతిని తెచ్చే బేస్‌క్యాంప్ కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# టీటీడీ సభ్యత్వానికి జంగా రాజీనామా ఆమోదించాలంటూ సీఎంకు లేఖ



అమరావతి, జనవరి 09: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యత్వానికి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం తన రాజీనామా లేఖను సీఎం చంద్రబాబు నాయుడుకి పంపారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలంటూ ఆ లేఖలో సీఎం చంద్రబాబుకు జంగా కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ పదవికి రాజీనామా చేయడానికి గల కారణాలను ఆ లేఖలో జంగా వివరించినట్లు తెలుస్తోంది.గతంలో తనకు కేటాయించిన బాలాజీనగర్‌లో ఫ్లాట్ నెంబర్ 2 నేటికీ ఖాళీగానే ఉందని.. దీనిని తనకు కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని కోరారని సమాచారం. దీనిని టీటీడీ బోర్డుకు ప్రభుత్వం పంపడంతో.. ఆమోదముద్ర పడినట్లు తెలుస్తోంది. అయితే గురువారం (09-01-2026)న జరిగిన కేబినెట్ భేటీలో ఈ భూ కేటాయింపును రద్దు చేసినట్లు సమాచారం. దాంతో ఆయన టీటీడీ సభ్యత్వ పదవికి రాజీనామా చేశారనే ప్రచారం సాగుతోంది.2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీకి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. అనంతరం ఆయన టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దాంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం నామినేటెడ్ పోస్టుల భర్తీకి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దాంతో టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడుని నియమించి.. పాలక మండలి సభ్యులుగా పలువురుని నియమించారు. ఆ జాబితాలో జంగా కృష్ణమూర్తికి స్థానం కల్పించారు.ఇక టీడీపీ చేరకు ముందు జంగా కృష్ణమూర్తి వైసీపీలో ఉన్నారు. పల్నాడులోని గురజాలకు చెందిన ఆయనకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి కేటాయించారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈయనకు టీటీడీ చైర్మన్ పదవి కేటాయిస్తారంటూ ఒక ప్రచారం సాగింది. టీటీడీ చైర్మన్ పదవికి వైవీ సుబ్బారెడ్డి రాజీనామా చేసిన తర్వాత ఈ పదవి జంగాను వరిస్తుందని.. చర్చ జరిగింది. కానీ ఆ పదవిని భూమన కరుణాకర్ రెడ్డికి వైఎస్ జగన్ కేటాయించిన విషయం విదితమే.

# బాబు బంగారం మహిళల ఆనందం



గుంటూరుజనవరి 9 : ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న కళాకృతులు. చేతితో రూపొందించిన బొమ్మలు, వస్తువులు.. ఆకట్టుకుం టున్న వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత, కళంకారీ వస్త్రాలు. మహిళలను, యువతులను కట్టిపడేస్తున్న ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు. నోరూరిస్తోన్న ఆహార పదార్థాలు, వంటకాలను సరస్ కేంద్రం గుంటూరువాసులకు అందుబాటులోకి తెచ్చింది. దేశంలో, రాష్ట్రంలో విభిన్న ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. కశ్మీర్ మొదలుకొని కన్యాకుమారి వరకు ఉత్తరాది, దక్షణాది రాష్ట్రాలు, ముంబై నుంచి మిజోరం వరకు తూర్పు, పశ్చిమ రాష్ట్రాల స్వయం సహాయక బృందాల రాకతో సరస్ ప్రాంగణం మినీ ఇండియాను తలపిస్తోంది. అఖిల భారత స్థాయిలో, న్యూఢిల్లీ వెలుపల ఇంత భారీ ఎత్తున సరస్ ప్రదర్శన నిర్వహించడం ఇదే తొలిసారి కావడం అదీ గుంటూరులో ఏర్పాటు చేయడం విశేషం.అయితే, సరస్ మేళాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించగా.. అక్కడ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. సీఎం అంటే నాలుగు గోడల మధ్య కూర్చునే పెత్తందారు కాదని.. అన్నగా అండగా ఉండటానికే ఇష్ట పడతానంటూ స్టాల్స్ అన్నీ కలియతిరిగారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించి వారి బాగోగులు, ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వివిధ స్టాళ్లను సందర్శించి మహిళా వ్యాపారుల్ని అభినందించారు. మాడుగుల హల్వా రుచి చూశారు. మహిళా సంఘాల ఉత్పత్తుల నాణ్యత, మార్కెట్ సామర్థ్యాన్ని ప్రశంసించారు. ప్రతి స్టాల్ ఒక విజయగాథను చెబుతోందని వ్యాఖ్యానించారు.సరస్‌లో ఆసక్తికర పరిణామం.దేశంలో అత్యంత భద్రత వలయంలో ఉండే అతి ముఖ్య రాజకీయ నేతల్లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఒకరు. అటువంటి నేత భద్రత వలయాన్ని పూర్తిగా ఛేదించుకొని సామాన్య ప్రజల చెంతకు చేరుతున్నారు. గతానికి భిన్నంగా ప్రతి ఇంటి సంగతులు అడిగి తెలుసుకుంటున్నారు. ఏం చేస్తున్నారు.. ఎంత సంపాదిస్తున్నారు.. ఏం కావాలని కోరుతున్నారు.. ఇలా అనేక ప్రశ్నలు వేసి జవాబులు రాబడుతున్నారు. గురువారం గుంటూరు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన ఆసాంతం ఆహ్లా దంగా సాగింది. ఇంటికి 'అన్న' వస్తే.. మహిళ ఎంత ఆనంద పడతారో అంత కంటే మించిన సంతోషం చేరివచ్చిన వారిలో కనిపించింది. సీఎం చంద్రబాబు సరస్ స్టాల్స్ పర్యటన మాడుగుల హల్వా వద్ద మొదలై చేతి వృత్తిదారుని మట్టి కుండలు వద్ద ముగిసింది. అక్కడ జరిగిన సంభాషణలు యథతదంగా.సీఎం సరస్ పర్యటన సందర్భంగా ఆసక్తికరమైన ఘటన చోటు చేసుకుంది. సీఎం స్టాల్స్ సందర్శిస్తున్న సందర్భంగా ఒక డ్వాక్రా మహిళ ఆయనకు దగ్గరకు వచ్చి మరో మహిళను చూపిస్తూ సార్, ఈమె మీతో ఫొటో దిగాలని ఇందాకటి నుంచి అల్లాడిపోతుంది. ఒక్క ఫొటో ఆమెతో దిగండి సార్ అని అనడంతో సీఎం చంద్రబాబు నవ్వుతూ ఫొటో దిగారు.ఇదే విగ్రహం శాండిల్ వుడ్ (ఎర్ర చందనం)తో చేస్తే.చంద్రగిరి నియోజకవర్గం నుంచి తీసుకువచ్చిన వెంకటేశ్వరుని చెక్క విగ్రహం సీఎం చంద్రబాబును అమితంగా ఆకర్షించింది. ఆ విగ్రహం ఏ వుడ్ (కర్ర)తో తయారు చేశారు అనే విషయాన్ని ఆరా తీసిన సీఎం స్టాల్ యజమానికి ప్రశ్నలు సంధించారు. ఇదే విగ్రహం శాండిల్ ఉడ్ (ఎర్ర చందనం)తో చేస్తే ఎంతకు అమ్మవచ్చు అని అడిగారు. అందుకు స్టాల్ యజమాని స్పందిస్తూ ఇదే విగ్రహం శాండిల్‌అటశ్రీశ్రీతో చేస్తే రూ. 2 వేలకు అమ్మవచ్చు అని బదులిచ్చారు.అప్పటికప్పుడే ఆర్థిక సాయం.మట్టితో కుండలు, ఇతర వస్తువులు తయారు చేసే వెంకట్రావు అనే వ్యక్తిపై సీఎం చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. స్టాల్ సందర్శన సందర్భంగా వెంకట్రావు భార్య తన భర్త అనారోగ్యం గురించి సీఎంకు విన్నవించారు. వెంటనే స్పందించిన సీఎం వైద్యానికి ఎంత కావాలి అని అడుగగా మహిళ రూ. 10 లక్షలు అవుతుందని చెప్పారు. రూ.6 లక్షలు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీఎం స్పందనతో చేతి వృత్తిదారులు అమితానందం

# చీము, నెత్తురు ఉంటే తాడిపత్రికి రండి



అనంతపురం: వైసీపీ నాయకులకు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇక్కడి నేతలకు సీమ పౌరుషం లేదన్న ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారులు, ఇతర వైసీపీ నేతలపై విరుచుకు పడ్డారు. 'దమ్ముంటే, తాడిపత్రి రండి' అంటూ సవాల్ విసిరారు. గురువారం అనంతపురం వచ్చిన ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గుడ్ మార్నింగ్, ఈవెనింగ్ అంటూ షో చేస్తున్నాడన్నారు. ఆయన ధర్మవరానికి చేసింది ఏమీ లేదన్నారు. ఆయన ఏం చేశాడో చెప్పాలంటూ నిలదీశారు. సీమ పౌరుషం గురించి మాట్లాడే అర్హత కేతిరెడ్డి ఫ్యామిలీకి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి కుమారులు తాడిపత్రిలో ప్రజల నుంచి దోచిన డబ్బుతోనే ఉప్పు, కారంతో తిని, ఇక్కడ మహిళలపైనే దాడులు చేశారన్నారు. ఇదేనా వారి పౌరుషం అంటూ ప్రశ్నించారు. 15 నెలలుగా పెద్దారెడ్డి కొడుకులు తాడిపత్రిలో కనిపించడం లేదన్నారు.'ఇదే నా మీ పౌరుషం' అంటూ ఆయన ప్రశ్నించారు. రాయలసీమ ప్రజలకు పౌరుషం లేదంటూ వెంకట్రామిరెడ్డి మాట్లాడటం సరికాదన్నారు. గత ఐదేళ్లు తనపై పోలీసులతో దాడులు చేయించారన్నారు. తాను, తన కుమారుడిని జైళ్లకు పంపినా... తమ ఆస్తులను నాశనం చేసినా... తాడిపత్రి ప్రజల కోసం అక్కడే ఉన్నామన్నారు. కేతిరెడ్డి ఫ్యామిలీకి చీము, నెత్తురు ఉంటే తాడిపత్రి రావాలంటూ సవాల్ విసిరారు. రాయలసీమ లిఫ్ట్ గురించి మాట్లాడే అర్హత ధర్మవరం మాజీ ఎమ్మెల్యేకు లేదన్నారు. పుట్లూరు, యల్లనూరుకు ఎందుకు నీళ్లు రాలేదో చెప్పాలన్నారు.వారు ఏనాడూ గేట్లకు గ్రీసు కూడా పెట్టించలేదన్నారు. మాజీ మంత్రి శైలా కొత్తగా వైసీపీలోకి చేరుకున్నాడనీ, ఆయన అతి మాటలు మాట్లాడడం మానుకోవాలంటూ ఘాటుగా హెచ్చరించారు. 76 ఏళ్ల వయసులో కూడా చంద్రబాబు నాయుడు పోలవరం కోసం తిరుగుతున్నారనీ, ఏపీ అభివృద్ధి కోసం తపిస్తున్నారన్నారు. ఆయనను విమర్శించడం తగదన్నారు. ఎవరు నీళ్లు తెచ్చారో బహిరంగ చర్చకు రావాలంటూ ధర్మవరం మాజీ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.రాయలసీమ పౌరుషం గురించి మాట్లాడిన కేతిరెడ్డికి నాలుగు గుర్రాలు, మినీ క్రూజర్ ఎలా వచ్చాయో సీమ పౌరుషం ఉంటే... ఉదయమే చెప్పాలంటూ సవాల్ విసిరారు. కేతిరెడ్డి ఫ్యామిలీని సీమ ప్రజలు తన్నడం ఖాయం అన్నారు. సీఎం చంద్రబాబు మంచివారని, ఆయన దయవల్ల వైసీపీ నాయకులు బతికిపోతున్నారన్నారు. తర్వాత తాడిపత్రి వైస్ చైర్మన్ షేక్షావలి, కౌన్సిలర్లు రేష్మా, లక్ష్మదేవి, మల్లికార్జున.. మాజీ ఎమ్మెల్యే , ఆయన కొడుకుల దౌర్జన్యాలు, దాడులపై మండిపడ్డారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అంతా భాగస్వామ్యం కావాలి



విజయవాడ, జనవరి9 : ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాళ్లతో మంత్రి.. ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్య, విద్య అందించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో వైద్య రంగంలో ప్రతికూలతలు ఎదుర్కొంటూనే సేవలందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఓపీ, ఐపీ, ఇతర సేవలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపీ, ఐపీ, ఇతర సేవలు గతంతో పోలిస్తే 12శాతం పెరిగాయని చెప్పుకొచ్చారు. రోగులు అధిక శాతం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా చేయగలిగామని వ్యాఖ్యానించారు. డాక్టర్లు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. కింది స్థాయిలో 28శాతం అవినీతి ఉందని తెలుస్తోందన్నారు. పారిశుధ్యంలో ఇంకా మార్పు రావాల్సి ఉందని తెలిపారు. బోధనాస్పత్రుల్లో అనుమతించిన బెడ్లు 500 వరకూ ఉంటున్నాయని వివరించారు. ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా మంచాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో మార్పులు రావాల్సి ఉందని చెప్పుకొచ్చారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో వైద్య సేవలు అందుబాటులోకి రావాల్సి ఉందని తెలిపారు. ఆధీనా యాప్ ఐడీ జనరేట్ చేసేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.క్షేత్రస్థాయిలో సూపరింటెండెంట్‌లు ఉండాలి.చాలాచోట్ల ఖీమీలు లేకపోవడం ప్రధాన అంశంగా కనిపిస్తోందని అన్నారుఅటశ్రీశ్రీ. సూపరింటెండెంట్‌లు, అడ్మినిస్ట్రేషన్ మధ్యలో సరైన కోఆర్డినేషన్ ఉండట్లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురంలోని ఆస్పత్రుల్లో చాలా అంశాల్లో లోపాలు తన దృష్టికి వస్తుంటాయని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సూపరింటెండెంట్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్ వెల్‌నెస్ వైపు ప్రభుత్వ వైద్యులు అందరూ ఆలోచించాలని కోరారు. ఆరు నెలలు సెకండరీ ఆస్పత్రుల్లో, ఆరు నెలలు బోధన ఆసుపత్రుల్లో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సొంతూళ్లలో పని చేయాలని చూసేవారు అటెండెన్స్ తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. కొత్త బోధనాస్పత్రులకు ఇంకా నిర్మాణమే మొదలవలేదని చెప్పుకొచ్చారు. ఎ×మీని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీగా చేయాలంటే రూ.1000 కోట్లు కావాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని.. అన్నీ కావాలంటే కొంత సమయం పడుతుందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలంటే ప్రధాన భూమిక డాక్టర్లదేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.ఆస్పత్రుల పరిస్థితి మారాల్సి ఉంది: సౌరభ్ గౌర్‌మూడు నెలల్లో ఆస్పత్రుల పరిస్థితి మారాల్సి ఉందని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సెక్రెటరీ సౌరభ్ గౌర్ సూచించారు. ఆరు నెలల్లో అత్యుత్తమ ఆస్పత్రులుగా మారాలని పేర్కొన్నారు. సంజీవనిలో పౌరులకు ఇచ్చే సేవలు తెలియాలని చెప్పుకొచ్చారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు లక్షకు పైగా రోగులు అన్నారు. ఆక్సిజన్ సప్లై, ఇతర సదుపాయాలు ప్రైవేటు సెక్టార్ నుంచి వినియోగిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ప్రైవేటు ఆస్పత్రులు పని చేస్తున్నాయని వివరించారు.

# జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుని అటకెక్కించారు



విజయవాడ, జనవరి9 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ చెప్పేవన్నీ అబద్ధాలని ధ్వజమెత్తారు. ప్రజలు జగన్ చెప్పే అబద్ధపు మాటలు నమ్మరని అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో రూ.9వందల 25కోట్లు జగన్ అనుయాయులకు కట్టబెట్టారని ఆరోపణలు చేశారు. ఏపీ రాజధానిని విజయవాడ, గుంటూరు మధ్యలో కట్టాలని జగన్ చెబుతున్నారని చెప్పుకొచ్చారు. రాజధాని విజయవాడకి గుంటూరుకి సమీపంలోనే ఉందని ప్రస్తావించారు.సాక్షి పేపర్ రాసేవన్నీ అబద్ధాలు.ఏపీ ప్రజలు ఎప్పుడు బాధపడాలని పులివెందుల ఎమ్మెల్యే కోరుకుంటున్నారని ఫైర్ అయ్యారు. సాక్షి పేపర్ రాసేవన్నీ అబద్ధాలు, అర్ధ సత్యాలని విమర్శలు చేశారు. మంగళగిరి, విజయవాడ, గుంటూరు లను కలిపి మహా నగరం నిర్మించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. మూడు మహా నగరాలు కట్టిన చరిత్ర చంద్రబాబుదని ప్రశంసించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుని అటకెక్కించింది జగన్ ప్రభుత్వమేనని విమర్శించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.వైసీపీ చరిత్ర అయిపోయింది.చరిత్రలో అత్యంత హీనమైన ఓటమి జగన్ దేనని ఎద్దేవా చేశారు. వైసీపీ చరిత్ర అయిపోయిందని విమర్శించారు. మరో 25ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పటి వరకు చంద్రబాబు ఉంటారా అని జగన్ అనడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు తగ్గించారని తెలిపారు. అమరావతి, విశాఖపట్నం, రాయలసీమలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.


# వైసీపీ శ్రేణుల నీచ బుద్ధికి నిదర్శనం శ్రీవారి చెంత ఇంతటి పాపమా



అమరావతి, జనవరి 9: అధికారం పోయిందనే అక్కసు.. కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ పెరుగుతుందనే కడుపుమంట.. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందనే అసూయ.. వెరసి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలాగైనా ఇరుకున పెట్టాలని తొలినాళ్ల నుంచి కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారు వైసీపీ నాయకులు, ఆ పార్టీ మద్దతుదారులు. సభలు సమావేశాలు పెట్టడం.. ఘర్షణలు సృష్టించి రచ్చ చేయడం.. వాటిని ప్రభుత్వంపై నెట్టడం.. శవ రాజకీయాలు చేయడం.. తప్పుడు ఆరోపణలు చేయడం.. ఇలా ఒకటేంటి.. వారి అబద్ధపు అరాచకాలకు అంతే లేకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రాష్ట్రవ్యాప్తంగా ఇదే తంతు నడుస్తోంది. వైసీపీ నాయకులది.ఆఖరికి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడి నివాసమైన తిరుమలను కూడా తమ రాజకీయాలకు వాడుకునే దుష్ప్రయత్నం చేశారు. తిరుమల విషయంలో ఇప్పటికే ఎన్నో అపచారాలు చేసిన వైసీపీ ముఠా.. సిగ్గు, ఎగ్గు లేకుండా మరిన్ని దుర్మార్గాలకు తెగబడుతోంది. తాజాగా శ్రీవారి సన్నిధిలో అపచారం చేసి.. దానిని రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టే కుటిల ప్రయత్నానికి ఒడిగట్టారు వైసీపీ శ్రేణులు. ఖాళీ మద్యం సీసాలు తిరుమలలో పడేసి.. అపచారం అపచారం అంటూ సంగనాచి టొంకులు టొంకారు. కానీ, వారి కుట్రలు, కుతంత్రాలు శ్రీనివాసుడిని ఇలాకాలో ఇసుమంతైనా పని చేయలేదు. అసలు ఆ సీసాలు తెచ్చిందే వారని.. టీటీడీ, కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేసే దుర్బుద్ధితోనే ఇలాంటి నీచానికి తెగబడ్డారని తేలింది. మద్యం సీసాలు తీసుకువచ్చి తిరుమలలో వేసింది, వీడియో తీసి వైరల్ చేసింది వైసీపీ సానుభూతిపరులు, జగన్ మీడియా ప్రతినిధులేనని బహిర్గతమైంది. మరి అసలు మ్యాటర్ తేలాక.. పోలీసులు ఊరుకుంటారా.. ఈ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులైన వైసీపీ కార్యకర్త అళ్లపాక కోటి, జగన్ మీడియా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ మోహన్ కృష్ణపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

# స్లీపర్ బస్సు ప్రమాదాల నివారణకు కేంద్రం నయా ప్లాన్

న్యూఢిల్లీ, జనవరి 9: గత ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో ఘోర బస్సు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్లీపర్ బస్సు ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం (జవత్ఖుత్రీ +శీఛ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది.అందుకే ఇలాంటి నిర్ణయం: గడ్కరీఏపీ, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు బయటపడిందన్నారు. అంతే కాకుండా అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు



చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలుబస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సులో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమర్జెన్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు సరికొత్త టెక్నాలజీ.దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వాహనం నుంచి వాహనానికి (ఎ2ఎ) కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఎ2ఎ టెక్నాలజీ ద్వారా వాహనాలు తమ వేగం, స్థానం, దిశ వంటి కీలక సమాచారాన్ని సమీప వాహనాలతో పంచు కోగలవని ఆయన వివరించారు.ఈ టెక్నాలజీ వల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేసినా.. రోడ్డుపై వాహనాలు ఆగి ఉన్నా.. మిగతా వాహనాలకు అలర్ట్ వెళ్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. తద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థను అన్ని వాహనాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సాంకేతికత రోడ్డు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ట్రంప్ కు మోదీ కాల్ చేయకపోవడం వల్లే ఇండియా-యూఎస్ ట్రేడ్ డీల్ ఆగిందా



న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు కాల్ చేయకపోవడం వల్లే రెండు దేశాల మధ్య ట్రేడ్ డీల్ ఆగిందని అమెరికా వాణిజ్య విభాగ కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ అన్నారు. తాజాగా ఆయన ఒక పాడ్ కాస్ట్ లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం (ట్రేడ్ డీల్) ఎప్పుడో కుదరాల్సి ఉంది. అయితే, అది చాలాకాలంగా వాయిదా పడుతూ వస్తోంది.దీనికి కారణం ప్రధాని మోదీనే అని అమెరికా అధికారి లుట్నిక్ తెలిపారు. "ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీనిపై ఆరు దశల చర్చలు జరిగాయి. అలాగే ఇండియాపై 50 శాతం టారిఫ్ లు తగ్గించేందుకు కూడా నిర్ణయం తీసుకున్నాం. తుది ఒప్పందం కుదిరే సమయంలో ట్రంప్ కు మోదీ ఫోన్ చేయకపోవడం వల్ల డీల్ కుదరలేదని లుట్నిక్ తెలిపారు. ట్రంప్ కు ఫోన్ చేయాలని మోదీకి సూచించినట్టు కూడా ఆయన తెలిపారు. అయితే, ఈ విషయంలో ఎందుకో ఇండియా (మోదీ) అసంతృప్తితో ఉన్నట్లు, అందుకే కాల్ చేసి ఉండకపోవచ్చని ఆయన అన్నారు. ఇదే సమయంలో వియత్నాం, ఇండోనేసియా, ఫిలిప్పైన్స్ వంటి దేశాలతో కూడా ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నట్టు, వీటన్నింటికి ముందే ఇండియాతో డీల్ ముగుస్తుందని భావించినట్లు చెప్పారు.ఇప్పుడు అసలు సమస్య ఇప్పుడు అమెరికా-ఇండియా మధ్య డీల్ కుదిరితే టారిఫ్ లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, దీనికి ఇండియా కూడా సిద్ధంగానే ఉండేమో అని ఆయన వెల్లడించారు. తాజాగా ట్రంప్ మాట్లాడుతూ.. తాను అసంతృప్తిగా ఉన్నానని మోదీకి తెలుసని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే, ఇండియాపై 500 శాతం టారిఫ్ విధించేందుకు అమెరికా నిర్ణయించింది.

# అమిత్ షా కార్యాలయం ఎదుట టీఎంసీ నిరసన ఎంపీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బెంగాల్: కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్-ఋణ దాడులను నిరసిస్తూ దిల్లీలో తృణమూల్ కాంగ్రెస్-ఎవీజ ఎంపీలు ఆందోళన చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ దిల్లీలోని కేంద్రహోం మంత్రి అమిత్ షా కార్యాలయం వద్ద ఎవీజ ఎంపీలు నిరసనలు చేశారు. డెరెక్ ఓబ్రియెన్, మహువా మొయిత్రాతో సహా మరికొంత మంది ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకొని అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడం కోసమే దర్యాప్తు సంస్థలను కేంద్రం పంపుతోందని ఎంపీలు ఆరోపించారు. తప్పుడు పద్ధతిలో ఈడీ దాడులు చేస్తోందని ఆక్షేపించారు. అప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ చేస్తోన్న ప్రయత్నమని మండిపడ్డారు. ఈ విధంగా బీజేపీ ఎన్నికలలో గెలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిరసన చేస్తున్న ఎంపీలను అదుపులోకి తీసుకున్నారు. వారిని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. "అమిత్ షా ఇదెక్కడ అహంకార వైఖరి ప్రజాస్వామ్యాన్ని అణిచివేయడానికి దిల్లీ పోలీసులను ఉపయోగించి ఎన్నికైన ప్రజా ప్రతినిధులపై దాడి చేస్తున్నారా దేశంలోని అసమ్మతిని ఇలాగే అణచివేస్తారా? మీరు ఆందోళన



చెందుతున్నారని ఒప్పుకోండి? ముందు ఋణని సిగ్గులేకుండా దుర్వినియోగం చేశారు. ఇప్పుడు ఎనిమిది మంది ఎంపీల శాంతియుత చేస్తున్న ధర్నాపై దాడి చేశారు. ఈ నిరాశ మీ భయాన్ని బయటపెడుతుంది. ప్రజాస్వామ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడానికి ప్రయత్నించవచ్చు, కానీ బంగాల్ భయపడదు.'' తృణముల్ కాంగ్రెస్'ఇక్కడ నిరసన చేస్తే ప్రజలు నవ్వుతారు' మరోవైపు దిల్లీలో హెంమంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంపై బంగాల్ బీజేపీ అధ్యక్షుడు సామిక్ భట్టాచార్య తప్పుబట్టారు. "బంగాల్ ప్రజల ముందు టీఎంసీ నేతలు నిరసనలు చేయలేరు. ఎందుకంటే బంగాల్ ప్రజలకు వీరి గురించి తెలుసు. అవినీతికి వ్యతిరేకంగా ఇక్కడ నిరసన చేస్తే ప్రజలు నవ్వుతారు. ఈడీ దర్యాప్తు చేస్తున్న సమయంలో ఒక ముఖ్యమంత్రి వచ్చి ఫైళ్లను తీసుకెళ్లారు. అయినా, ఈడీ సోదాలు రాజకీయ పార్టీ కార్యాలయంలో జరగలేదు. టీఎంసీ నేతలు బొగ్గు స్కామ్‌లో పాల్గొన్నారు. టీఎంసీ, అవినీతి రెండు పర్యాయపదాలు." అని అన్నారు.ఐప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలు అంతకుముందు గురువారం బొగ్గు అక్రమ రవాణాకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలు చేపట్టింది. ఆ సంస్థ సహవ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో కూడా సోదాలు జరిపింది. అయితే, సోదాలు జరుపుతుండగా సీఎం మమత బెనర్జీ ప్రవేశించి కీలక ఆధారాలను పట్టుకెళ్లారని ఈడీ ఆరోపించింది. సాల్ట్ లేక్‌లోని ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు చేస్తున్న సమయంలో మమత తన అనుచరులు, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌తో కలిసి బలవంతంగా లోపలికి ప్రవేశించారని తెలిపింది. ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు పలు కీలక దస్త్రాలను ఆమె తన వెంట తీసుకెళ్లిపోయారని ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతీక్ జైన్ తృణముల్ కాంగ్రెస్ ఐటీ సెల్ అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు.

# క్రిమినల్ సిండికేట్‌లా వ్యవహరించిన లాలూ కుటుంబం



భూములకు ఉద్యోగాల కుంభకోణంలో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ అయన కుటుంబ సభ్యులపై అభియోగాల నమోదుకు ఢిల్లీ కోర్టు శుక్రవారంనాడు ఆదేశాలిచ్చింది. రైల్వే మంత్రిత్వ శాఖను తన వ్యక్తిగత సామ్రాజ్యంగా భావించి క్రిమినల్ ఎంటర్‌ప్రైజ్‌గా మార్చారని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి విశాల్ గోగ్నే తప్పుపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాలను బేరసారాల చిప్‌గా ఉపయోగించుకుని రైల్వే అధికారులు, సన్నిహితులతో కుమ్మక్కై భూములు పొందారని కీలక వ్యాఖ్యలు చేశారు.లాలూ ప్రసాద్, ఆయన భార్య రబ్రీదేవి, కుమారులు తేజస్వి యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్, కుమార్తె మిసా భారతితో సహా అయన కుటుంబ సభ్యులు ఉద్యోగానికి బదులుగా భూమిని స్వాధీనం చేసుకున్నట్టు బలమైన ఆధారాలున్నాయని ఢిల్లీ కోర్టు పేర్కొంది. భూములను ఆక్రమించుకునేందుకు క్రిమినల్ ఎంటర్‌ప్రైజ్ నడిపారని లాలూ, ఆయన కుటుంబ సభ్యులను తప్పుపట్టింది. ఈ కేసులో తమను నిర్దోషులుగా విడుదల చేయాలని లాలూ కుటుంబం చేసిన పిటిషన్ ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. అభియోగాల నమోదుకు ఆదేశాలిస్తూ విచారణను జనవరి 23వ తేదీకి వాయిదా వేసింది.లాలూ ప్రసాద్ యాదవ్ 2004-2009 మధ్య కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఇండియన్ రైల్వే గ్రూప్-డి కేటగిరి పోస్టులను నియామకాలు జరిపారు. ఇందుకు బదులుగా వారి భూములను లాలా కుటుంబ సభ్యులతో పాటు ఓ ప్రవేటు కంపెనీకి బదిలీ చేశారని సీబీఐ ఆరోపించారు.మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద లాలూపై ట్రయిల్ కోర్టు అభియోగాలను మోపింది. అయితే ఈ ఉత్తర్వులపై లాలూ ప్రసాద్ ఇటీవల ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. తమపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని, రాజకీయ దురుద్దేశాలతో కూడుకున్నవని నిందితులు చెబుతున్నారు.

# సమస్య ఏదైనా నెహ్రూను విమర్శించడం సరికాదు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ విధానాలను విమర్శిస్తూ, బీజేపీకి దగ్గరవుతున్నారంటూ కొంతకాలంగా విమర్శలను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరకూర్ తాజాగా భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. నెహ్రూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడని కొనియాడారు. అయితే నెహ్రూపై తన అభిమానం గుడ్డిది కాదని అన్నారు. నెహ్రూ పొరపాట్లు చేసి ఉండవచ్చుని, అయితే దేశంలోని అన్ని సమస్యలకు ఆయనే కారణమంటూ నిందించడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. నెహ్రూ వారసత్వంపై బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై కేరళ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఇంటర్నేషన్ బుక్ ఫెస్టివల్‌లో (ఖా×దీఖీ)లో శశిథరూర్ మాట్లాడారు'నేను నెహ్రూ అభిమానిని. అయితే ఆయన నమ్మకాలు, విధానాలన్నింటికీ గుడ్డిగా తలాడించను. ఆయన ఆలోచనా దృక్పథం ప్రశంసనీయమైంది. ఆయన తీసుకున్న అనేక చర్యలు ప్రశంసలకు అర్హమైనవి. ముఖ్యంలో



దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఆయన దృఢంగా నెలకొల్పారు. అలా అని వారు (మోదీ ప్రభుత్వం) ప్రజాస్వామి వ్యతిరేకులని కాదు. అయితే నిశ్చయంగా వారు నెహ్రూ వ్యతిరేకులు. సమస్య ఏదైనా నెహ్రూను వారు విమర్శలు చేస్తూనే ఉన్నారు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు.ఇండియా-చైనా మధ్య 1962లో జరిగిన యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, కొన్ని కేసుల్లో వారి (మోదీ ప్రభుత్వం) విమర్శలకు ఆధారాలుండవచ్చుని, ఆ యుద్ధంలో చైనాపై ఓటమికి నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు కారణం కావచ్చని అన్నారు. అయితే సమస్య ఏదైనా ప్రతిదానికి వాళ్లు నెహ్రూను నిందించడం మాత్రం సరికాదని అన్నారు.రచయితగా తన జర్నీని ప్రస్తావిస్తూ, చిన్నప్పుడు ఆస్మా కారణంగా తాను పుస్తకాలు చదవడాన్ని ఎక్కువగా ఇష్టపడేవాడినని, అప్పుడు టెలివిజన్ కానీ, మొబైల్ ఫోన్లు కానీ లేవని, పుస్తకాలే తన సహచరులని థరూర్ చెప్పారు. చాలా చిన్నప్పుడే తాను తొలి నవల రాశానని, అయితే సిరా ఒలికిపోవడంతో ఆ పుస్తకాన్ని కోల్పోయానని తెలిపారు. శ్రీ నారాయణ్ గురు బయోగ్రఫీ తన 28వ పుస్తకమని చెప్పారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పుస్తక పఠనం తగ్గిపోయిందని, కానీ కేరళలో మాత్రం రీడింగ్ కల్చర్ కొనసాగుతోందన్నారు.

# కేంద్ర హెూం మంత్రిత్వ శాఖలో కీలక నియామకం




న్యూఢిల్లీ, జనవరి 9: కేంద్ర హెూం మంత్రిత్వ శాఖలో కీలక నియామకం జరిగింది. అంతర్గత భద్రత విభాగానికి కొత్త స్పెషల్ సెక్రటరీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ఆనంద్ స్వరూప్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని ప్రభుత్వ ఉత్తర్వులు వెల్లడించాయి.పదవిలో ఉన్న ప్రవీణ్ వశిష్ఠ స్థానంలో ఆనంద్ స్వరూప్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆనంద్ స్వరూప్ ప్రస్తుతం జాతీయ మానవ హక్కుల కమిషన్ (దీఎ=జ)లో డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్)గా సేవలందిస్తున్నారు. ఆయనకు దేశ అంతర్గత భద్రత, పోలీసు పరిపాలన, దర్యాప్తు వ్యవస్థల్లో విశేష అనుభవం ఉంది.ఈ అంశాలపైన కీలక నిర్ణయాలుప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఆనంద్ స్వరూప్ పదవీకాలం ఆయన బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి 2029 ఆగస్టు 31 వరకు లేదా పదవీ విరమణ తేదీ వరకు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగనుంది. అంతర్గత భద్రత విభాగం కేంద్ర హెూం మంత్రిత్వ శాఖలో అత్యంత కీలకమైన విభాగం కావడంతో, ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉగ్రవాద నిరోధం, అంతర్గత భద్రతా సవాళ్లు, సైబర్ భద్రత, నక్సలిజం, సరిహద్దు భద్రత వంటి అంశాలపై ఈ విభాగం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.

# ఆయన్ను బ్లాస్ట్ చేస్తాం బంగాల్ గవర్నర్‌కు బెదిరింపు మెయిల్

బెంగాల్ : బంగాల్‌లో రాజకీయ వాతావరణం రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఒకవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు, మరోవైపు అధికార తృణమూల్ కాంగ్రెస్ ఉటీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు- ఇదంతా కొనసాగుతున్న తరుణంలో గవర్నర్ సీవీ ఆనంద్ బోస్‌కు బెదిరింపు ఈమెయిల్ రావడం రాష్ట్రంలో కలకలం రేపింది.బ్లాస్ట్ చేస్తామంటూ బెదిరింపులుగురువారం అర్ధరాత్రి కోల్‌కతాలోని లోక్ భవన్‌లో భద్రతను భారీగా పెంచారు. గవర్నర్ సీవీ ఆనంద్ బోస్‌కు "విల్ బ్లాస్ట్ హిమ్" అంటూ పేలుడు హెచ్చరికతో కూడిన బెదిరింపు ఈమెయిల్ అందినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ బెదిరింపు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే కేంద్ర హెూం మంత్రిత్వ శాఖకు సమాచారం అందించారు. ఇప్పటికే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన గవర్నర్‌కు అదనపు భద్రత ఏర్పాటు చేశారు.భద్రత కట్టుదిట్టం చేసిన అధికారులుఈ ఘటన అనంతరం గవర్నర్ భద్రత బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీనియర్ అధికారులు అర్ధరాత్రి సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. బెంగాల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో గవర్నర్ రక్షణను మరింత కట్టుదిట్టం చేశారు. ఇదే తొలిసారి కాదని, గతంలో కూడా ఇలాంటి బెదిరింపు సందేశాలు వచ్చినట్లు రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి. ఈమెయిల్ వెనుక ఎవరు ఉన్నారు? ఇది రాజకీయంగా ప్రేరపణా? అన్న కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.గవర్నర్‌కే భద్రత లేకుండా పోయింది: బీజేపీఈ ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. బీజేపీ నాయకుడు అమిత్ మాల్వియా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "మమతా బెనర్జీ పాలనలో గవర్నర్‌కే భద్రత



లేకుండా పోయింది. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా కూలిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు, "హెూంమంత్రి హెూదాలో ఉన్న మమతా బెనర్జీ, బొగ్గు కుంభకోణం, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ సంస్థను కాపాడేందుకు ఈడీ నుంచి కీలక ఫైళ్లను లాక్కునే పనిలో బిజీగా ఉన్నారు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.బంగాల్‌లో హైడ్రామాఇదిలా ఉండగా, గురువారం బంగాల్‌లో హైడ్రామా చోటుచేసుకుంది. బొగ్గు అక్రమ రవాణా కేసుకు సంబంధించి ఈడీ దాడులు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ-ప్యాక్ (×-ఫాజ) కార్యాలయాలు, దాని చీఫ్ ప్రతీక్ జైన్ నివాసానికి వెళ్లారు. ఈడీ చర్యలను ప్రశ్నించిన మమతా, పార్టీకి సంబంధించిన హార్డ్‌డిస్కులు, అభ్యర్థుల జాబితాలు, వ్యూహాత్మక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.ఒక రాజ్యాంగ హెూదాలో ఉన్న వ్యక్తి రాజ్యాంగ అమలుకు సహకరించాలి. ప్రజాసేవకుడు తన విధులను నిర్వర్తించకుండా అడ్డుకోవడం భారతీయ న్యాయ సంహిత (దీఖా) ప్రకారం నేరం. అదే విధంగా బెదిరించడం, భయపెట్టడం మరింత తీవ్రమైన నేరం" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కూడా రాజ్యాంగ హెూదాలో ఉన్నారని, ఆమె చర్యలు రాజ్యాంగ పరిధిలో ఉన్నాయా లేదా అన్న అంశంపై నిపుణులతో సంప్రదిస్తున్నట్లు చెప్పారు. అయితే విషయం న్యాయస్థానంలో ఉన్నందున (సబ్‌జుడిస్) తాను తుది వ్యాఖ్య చేయబోనని స్పష్టం చేశారు.ఈడీ ఇప్పటికే కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. దాడుల సమయంలో అక్రమ జోక్యం జరిగిందని, దర్యాప్తుకు అడ్డంకులు సృష్టించారని ఆరోపిస్తూ కేసు నమోదు చేసింది. ఈడీ ప్రకారం, బొగ్గు అక్రమ రవాణా కేసులో కీలక ఆధారాల కోసం శాంతియుతంగా తనిఖీలు జరుపుతుండగా ముఖ్యమంత్రి, ఆమె సహచరులు, పోలీసు అధికారులు జోక్యం చేసుకున్నారని ఆరోపించింది. ప్రతీక్ జైన్ నివాసం, ఐ-ప్యాక్ కార్యాలయాల నుంచి కీలక డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను బలవంతంగా తీసుకెళ్లారని తెలిపింది. ఇదే సమయంలో టీఎంసీ మాత్రం బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేసింది. "ఎన్నికల వ్యూహాలు, పార్టీ పత్రాలు స్వాధీనం చేసుకోవడమే ఈడీ దాడుల అసలు లక్ష్యం. ఇది ప్రజాస్వామ్యంపై దాడి" అంటూ సోషల్ మీడియా వేదికగా మండిపడింది.

# 24 గంటల వ్యవధిలోనే 12 సార్లు గుజరాత్‌ను వణికించిన వరుస భూకంపాలు



గుజరాత్ : రాజ్‌కోట్ ను వరుస భూకంపాలు వణికించాయి. కేవలం 24 గంటల వ్యవధిలోనే పదికిపైగా సార్లు భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత స్వల్ప స్థాయిలోనే నమోదైంది. వరుస ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ దాదాపు 12 సార్లు భూమి కంపించింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 2.6 నుంచి 3.8 మధ్య నమోదైంది. రాజ్‌కోట్ జిల్లాలోని మూడు తాలూకాల్లో ఈ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు గాంధీనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మోలాజికల్ రీసెర్చ్ తెలిపింది. ఉప్లేటా, ధోరాజీ, జెట్‌పూర్ తాలూకాల్లో ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఉప్లేటాకు తూర్పు ఈశాన్య దిశలో 27 నుంచి 30 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది.అయితే రాజ్‌కోట్ కలెక్టర్ ఓం ప్రకాష్ మాత్రం జిల్లాలోని ఉప్లేటా, ధోరాజీ, జెట్‌పూర్ తాలూకాల్లో 21 సార్లు భూమి కంపించినట్లు చెప్పారు. వీటి తీవ్రత 1.4 నుంచి 3.8 మధ్య ఉన్నట్లు వివరించారు. మొదటి భూకంపం గురువారం రాత్రి 8:43 గంటల సమయంలో ఉప్లేటా పట్టణానికి సమీపంలో నమోదైనట్లు ఓ అధికారి తెలిపారు. అయితే, ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు వరుస భూకంపాలతో రాజ్‌కోట్ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బయటకు పరుగులు తీశారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ భూమి పలుమార్లు కంపించినట్లు స్థానికులు తెలిపారు.

# ఎప్పటికీ రోహితే నా కెప్టెన్!: ఐసీసీ చైర్మన్ జై షా



టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మను ఐసీసీ చైర్మన్ జై షా 'కెప్టెన్ల' అని సంబోధించాడు. దీనికి అక్కడున్న రోహిత్ శర్మ కూడా నవ్వులు చిందించాడు. రీసెంట్‌గా రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహించిన ఈవెంట్‌లో టీమ్ఇండియా క్రికెటర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, హర్మన్ ప్రీత్ కౌర్‌తోపాటు జై షా కూడా పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లో మాట్లాడిన జై షా హిట్‌మ్యాన్‌ను కెప్టెన్ అంటూ పిలిచాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'మన కెప్టెన్ ఇక్కడే కూర్చొని ఉన్నాడు. అతడు టీమ్ఇండియాకు అతడు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించాడు. అందుకే నేను రోహిత్‌ను కేవలం కెప్టెన్ అనే పిలుస్తా. 2023 వరల్డ్‌కప్ టోర్నీలో భారత్ వరుసగా పది మ్యాచ్‌ల్లో నెగ్గింది. కానీ, ఆ టోర్నీలో ట్రోఫీ నెగ్గలేకపోయినా, మన జట్టు అభిమానుల హృదయాలు గెలుచుకుంది. తర్వాత నేను 2024 ఫిబ్రవరిలో రాజ్‌కోట్ వేదికగా ఓ విషయం చెప్పాను. వచ్చే ప్రపంచకప్‌లో ట్రోఫీతోపాటు అభిమానుల హృదయాలను కూడా గెలుచుకోబోతున్నాం' అని ఆ ఈవెంట్‌లో జై షా అన్నారు.ఇక ఇదే ఈవెంట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ సైతం 2024 టీ20 వరల్డ్‌కప్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మపై ప్రశంసలు కురిపించారు. రోహిత్ శర్మ జర్నీ గురించి చెబుతూ అతడు యువతకు స్ఫూర్తి అని అన్నారు. 'రోహిత్ చిన్నప్పుడు తన గ్రాండ్ పేరెంట్స్ వద్ద ఉండేవాడు. క్రికెట్ ప్రాక్టీస్ కోసం కిట్‌తో బొరివాలి నుంచి చర్చ్‌గేట్ దాకా లోకల్ ట్రైన్‌లో ప్రయాణించేవాడు. అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ టీమ్ఇండియా కెప్టెన్ దాకా ఎదిగిన తీరు అద్భుతం. అలా రోహిత్ భారత క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాళ్లో ఒకడిగా నిలిచాడు. అతడి జర్నీ ప్రపంచానికే స్ఫూర్తి. అతడో ఐకానిక్ష అని నీతా అంబానీ అన్నారు.కాగా, రోహిత్ శర్మ 2021లో టీమ్ఇండియా ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా బాధ్యతలు అందుకున్నాడు. 2022 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్‌లో భారత్ ఓడింది. కానీ ఆ తర్వాత వరుసగా ఆడిన మూడు ఐసీసీ టోర్నీల్లో భారత్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు రోహిత్. అతడి కెప్టెన్సీలోనే టీమ్ఇండియా ఏడాది కాలంలో రెండుసార్లు ఐసీసీ టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది.అలా భారత్ క్రికెట్ జట్టు దాదాపు 17ఏళ్ల తర్వాత 2024లో టీ20 వరల్డ్‌కప్, అలాగే 8ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది రోహిత్ కెప్టెన్సీలోనే. దీంతో భారత్‌కు ఒకటి కంటే ఎక్కువ ఐసీసీ ట్రోఫీలు అందించిన రెండో కెప్టెన్‌గా ధోనీ తర్వాతి స్థానంలో నిలిచాడు. అలా కెప్టెన్‌గా కొంతకాలమే జట్టును నడిపించినప్పటికీ రోహిత్ తనదైన ముద్ర వేశాడు.రోహిత్ సారథ్యంలో 56 వన్డేల్లో భారత్ ఏకంగా 42 విజయాలు సొంతం చేసుకుంది. మరో 12 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ టై కాగా, ఇంకో వన్డేలో ఫలితం తేలలేదు. ఇక టీ20లల్లోనూ రోహిత్ కెప్టెన్సీ రికార్డు ఘనంగానే ఉంది. 62 మ్యాచ్‌ల్లో 49 టీ20ల్లో టీమ్ఇండియా విజయం సాధించింది. టీ20 ఫార్మాట్లో అతడి విన్నింగ్ పర్సంటేజ్ 79.03గా ఉంది.కాగా, 2024 వరల్డ్‌కప్ ఫైనల్ అనంతరం రోహిత్ టీ20లకు గుడ్‌బై చెప్పేశా. ఇక గతేడాది మే నెలలో సుదీర్ఘ ఫార్మాట్ టెస్టులకు కూడా రిటైర్మెంట్ పలికాడు. ప్రస్తుతం అతడు వన్డేల్లోనే ఆడుతున్నాడు. అయితే గతేడాది ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు రోహిత్‌ను బీసీసీఐ కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను మేనేజ్‌మెంట్ వన్డే, టెస్టు ఫార్మాట్‌కు కెప్టెన్‌గా నియమించింది. ఇక టీ20లకు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.



## ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టి వైభవ్ సూర్యవంశీ వైపు

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. జింబాబ్వే వేదికగా జరగనున్న అండర్-19 వరల్డ్ కప్ 2026 కోసం భారత జట్టు ఇప్పటికే అక్కడికి చేరుకుంది. జనవరి 15న అమెరికాతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన వేటను ప్రారంభించనుంది. అయితే ఈ టోర్నీలో వైభవ్ ఒక భారీ లక్ష్యాన్ని తన కళ్లముందు ఉంచుకున్నాడు. అదే మిషన్ 607. ఈ సంఖ్య వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో తెలిస్తే మీరు షాక్ అవుతారు. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఆయిన్ మోర్గాన్ పేరిట ఉంది. మోర్గాన్ 2004 మరియు 2006లో ఐర్లాండ్ తరపున ఆడి మొత్తం 606 పరుగులు చేశాడు. అయితే వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి 607 పరుగులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోర్గాన్ ఈ ఘనతను రెండు వరల్డ్ కప్ లలో సాధించగా, వైభవ్ మాత్రం తన అద్భుత ఫామ్‌తో ఈ ఒక్క టోర్నీలోనే ఆ మైలురాయిని చేరుకోవాలని చూస్తున్నాడు. ఇది వినడానికి కష్టంగా అనిపించినా, వైభవ్ బాదుడు చూస్తుంటే అది అసాధ్యమేమీ కాదనిపిస్తోంది.ఇటీవల జరిగిన సౌతాఫ్రికా పర్యటనలో వైభవ్ సూర్యవంశీ చెలరేగిపోయాడు. ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ టీమిండియాకు 3-0తో వన్డే సిరీస్‌ను అందించాడు. బౌలర్ ఎవరైనా సరే ఏమాత్రం కనికరం లేకుండా స్టేడియం బయటకు పంపడమే వైభవ్ స్టైల్. అదే ఊపును ఇప్పుడు వరల్డ్ కప్ లో కూడా కొనసాగించాలని కోరుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్ గా వైభవ్ ఇచ్చే మెరుపు ఆరంభాలు భారత్ కు కొండంత బలాన్ని ఇస్తున్నాయి.వరల్డ్ కప్ మెయిన్ మ్యాచుల కంటే ముందు వైభవ్ రెండు వార్మప్ మ్యాచుల్లో తన సత్తా చాటనున్నాడు. జనవరి 10న స్కాట్లాండ్‌తో, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది.

## శ్రీలంక బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ రాథోడ్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి ముందు శ్రీలంక క్రికెట్ బోర్డు తమ జట్టు కోచింగ్ విభాగాన్ని బలోపేతం చేయడంపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా శ్రీలంక నూతన బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ బ్యాటింగ్ విక్రమ్ రాథోడ్‌ను నియమించింది. ఇప్పటికే శ్రీలంక ఫీల్డింగ్ కోచ్‌గా భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా విక్రమ్ రాథోడ్ ఈ జాబితాలో చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన భారత జట్టులో విక్రమ్ రాథోడ్, ఆర్ శ్రీధర్ భాగంగా ఉన్నారు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తున్న విక్రమ్ రాథోడ్ జనవరి 15న శ్రీలంక జట్టులో బ్యాటింగ్ కోచ్‌గా చేరనున్నాడు. విక్రమ్ రాథోడ్ 2019 నుంచి 2024 వరకు భారత జట్టు బ్యాటింగ్ కోచ్‌గా సేవలందించాడు. ఆ సమయంలో భారత్ వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ చేరడంతో పాటు ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచింది.ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వరకు భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న సంగతి తెలిసిందే. శ్రీలంక తమ లీగ్ మ్యాచ్‌లను సొంతగడ్డపైనే ఆడనుంది. ఈ క్రమంలోనే శ్రీలంక క్రికెట్ బోర్డు భారత కోచ్‌లకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది



## సెమీఫైనల్లో పీవీ సింధు..

గాయం నుంచి కోలుకొని కొత్త సీజన్‌లో తొలి టోర్నీ బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీలో సింధు సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ మధ్యలోనే జపాన్ ప్లేయర్ అకానే యమగుచి గాయంతో తప్పుకోవడంతో సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. యమగుచి ఆట నుంచి తప్పుకోవడానికి ముందు సింధు 21-11తో తొలి గేమ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో ప్రపంచ మూడో ర్యాంకర్ యమగుచితో ముఖాముఖి పోరును 15-12తో 18వ ర్యాంకర్ సింధు మెరుగుపర్చుకుంది. శనివారం జరిగే సెమీఫైనల్లో చైనా షట్లర్, రెండో సీడ్ వాంగ్ జియితో సింధు తలపడనుంది. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో సింధు 21-14, 22-20తో సుంగ్ షువో యున్(చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-8, 21-13తో ప్రపంచ 9వ ర్యాంకర్ టొమోకా మియజకి(జపాన్)ను ఓడించింది. కేవలం 33 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను సింధు ముగించడం విశేషం. క్వార్టర్ ఫైనల్లో యమగుచి గాయం సింధుకు కలిసొచ్చింది.పురుషుల డబుల్స్ లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పోరాటం క్వార్టర్స్‌లో ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 10-21, 21-23 తేడాతో ఎమ్ఎస్ ఫిక్రి-ఎఫ్ అల్ఫియాన్ జోడి చేతిలో ఓటమిపాలైంది.

## రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర శతకం



న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు ఎంపికవ్వని రుతురాజ్ గైక్వాడ్.. తన బ్యాట్‌తోనే సెలెక్టర్లకు సమాధానమిచ్చాడు. విధ్వంసకర శతకంతో చెలరేగి వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. 'నీ అవ్వ నన్నే తప్పిస్తారా' అని బౌలర్లను శతక్కొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా గురువారం గోవాతో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర సెంచరీతో అరాచకం సృష్టించాడు. తద్వారా లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 20 శతకాలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను విరాట్ కోహ్లీ, బాబర్ ఆజామ్ ఆల్‌టైమ్ రికార్డ్‌లను బద్దలుకొట్టాడు.శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్ గాయాల నేపథ్యంలో సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా పిలుపును అందుకున్న రుతురాజ్ గైక్వాడ్.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో నాలుగో స్థానంలో బరిలోకి దిగాడు. తొలి వన్డేలో విఫలమైనా..రెండో వన్డేలో సెంచరీతో చెలరేగాడు. మూడో వన్డేలో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. అయితే గిల్, అయ్యర్ అందుబాటులోకి రావడంతో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ నుంచి రుతురాజ్ ఉద్వాసనకు గురయ్యాడు.ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. రాబిన్ ఊతప్ప అయితే.. భారత సెలెక్టర్లపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముంబై, ఢిల్లీ, పంజాబ్ ఆటగాళ్లకే భారత జట్టులో సుస్థిరం స్థానం ఉంటుందని, రుతురాజ్‌కు అన్యాం జరిగిందని మండిపడ్డాడు.



## కెండ్రా లస్ట్‌తో విరాట్ కోహ్లీ..

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతనికి భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. శత్రు దేశం పాకిస్థాన్‌లోనూ కోహ్లీ అంటే పడి చచ్చే అభిమాన గణం ఉంది. దాంతో కోహ్లీ తరుచూ వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. అయితే తాజాగా కెండ్రా లస్ట్ అనే అమెరికా శృంగార తార.. సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీతో ఉన్న ఫోటోను పంచుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అనుకోకుండా టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీని యూకేలో కలిసానని కెండ్రా లస్ట్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఫోటోను పంచుకుంది. ఈ పోస్ట్‌కు కెండ్రా లస్ట్.. 'అనుకోకుండా జరిగే సమావేశాలు ఎప్పుడూ అత్యుత్తమంగా ఉంటాయి. ఎంత గొప్ప స్ఫూర్తి, నిజంగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి'అనే క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటో క్షణాల్లో వైరల్ కాగా.. ఇది ఫేక్ అంటూ అభిమానులు తేల్చేసారు. ఏఐ జనరేటేడ్ ఫొటో అని కామెంట్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ కుటుంబం లండన్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నప్పటికీ.. గత నెలరోజులుగా భారత్‌లోనే ఉన్నాడు. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ఆడేందుకు భారత్‌కు వచ్చిన కోహ్లీ.. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్ధమవుతున్నాడు. అలాంటిది కోహ్లీని యూకేలో కెండ్రా లస్ట్ ఎలా కలిసిందని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కెండ్రా లస్ట్ తరుచూ ఏఐ జనరేటేడ్ ఫొటోలను పంచుకుంటుంది. ఇటీవల భారత బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్‌ను కలిసినట్లు ఏఐ జనరేటెడ్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకొని వార్తల్లో నిలిచింది. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న విరాట్ కోహ్లీ.. తనకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్నాడు. ఆదివారం వడోదర వేదికగా జరిగే తొలి వన్డేతో మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ సెంచరీ, హాఫ్ సెంచరీ( 131, 77)తో రాణించాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు బాది 302 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.

శనివారం, జనవరి 10, 2026
నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక






# డ్రగ్స్ కేసులో నవదీప్ కు భారీ ఊరట

డ్రగ్స్ కేసులో నటుడు నవదీప్‌కు పెద్ద ఊరట లభించింది. ఆయనపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గుడిమల్కాపూర్‌లో నమోదైన ఈ కేసులో నవదీప్ వద్ద ఎలాంటి మత్తుపదార్థాలు దొరకలేదన్న అంశాన్ని కోర్టు స్పష్టంగా గుర్తించింది.

నవదీప్ తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ వెంకట సిద్ధార్థ్ మాట్లాడుతూ.. ఈ కేసులో నవదీప్ పేరు కేవలం ఎఫ్ఐఆర్ లో మాత్రమే ఉందని, సంఘటన జరిగిన ప్రదేశంలో ఆయన వద్ద డ్రగ్స్ ఏవీ లభించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పాట్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో నవదీప్‌కు సంబంధించిన ఆధారాలు లేవని వివరించారు.

ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. సరైన ఆధారాలు లేకుండా కేసు కొనసాగించడం సరికాదని పేర్కొంది. నవదీప్ వద్ద డ్రగ్స్ లభించనందున, ఆయనపై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నవదీప్‌కు చట్టపరంగా పెద్ద ఊరట లభించినట్టయింది.

# ఫర్వాలేదనిపించుకున్న రాజా సాబ్

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ సబ్జెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి అల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.




నాయనమ్మకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహల్ ప్రవేశం, అక్కడ జరిగే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యూజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్, ఫైట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయితే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణేష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను,

# చీరకట్టులో యాక్షన్.. సమంత కొత్త సినిమా టీజర్

కొంతకాలంగా వెండితెరకు దూరంగా ఉన్న స్టార్ హీరోయిన్ సమంత, పూర్తిస్థాయి యాక్షన్ అవతార్‌తో గ్రాండ్ రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' టీజర్‌ను చిత్ర యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. ఈ టీజర్‌లో సమంత మునుపెన్నడూ చూడని రగ్డ్, సీరియస్ లుక్‌తో, చీరకట్టులో బస్సులో ఫైట్ చేస్తున్న సన్నివేశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తున్నాయి. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది.'మా ఇంటి బంగారం' అనే టైటిల్ వినడానికి సున్నితమైన కుటుంబ కథ చిత్రంగా అనిపించినా, టీజర్ చూశాక ఇది పక్కా యాక్షన్ థ్రిల్లర్ అని స్పష్టమవుతోంది. సమంత కెరీర్‌లో ఇది ఒక భిన్నమైన ప్రయత్నంగా నిలవనుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'ఓ బేబీ' తర్వాత దర్శకురాలు నందిని రెడ్డితో సమంత చేస్తున్న రెండో సినిమా కావడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సమంత సహ నిర్మాతగా వ్యవహరించడం మరో విశేషం.త్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కాంతారా' ఫేమ్ గుల్షన్ దేవయ్య, కన్నడ నటుడు దిగంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సంతోశ్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా, ఆయన నేపథ్య సంగీతం యాక్షన్ సన్నివేశాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.ఇప్పటికే 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్' వంటి వెబ్ సిరీస్‌లలో యాక్షన్ పాత్రలతో మెప్పించిన సమంత, ఈ సినిమాలో డూప్ సహాయం లేకుండా సొంతంగా స్టంట్స్ చేస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత పూర్తిస్థాయి కథనాయిక ప్రాధాన్యమున్న చిత్రంతో సమంత వస్తుండటంతో, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# జన నాయగన్ కు ఊరట

## సెన్సార్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం



విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమాకు ఊరట లభించింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. గత డిసెంబరులో సెన్సార్ కోసం జన నాయగన్ సినిమాను పంపగా అభ్యంతరకర మైన సన్నివేశాలు తొలగించాలని, కొన్ని సంభాషణలు మ్యూట్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు మార్పులు చేసిన నిర్మాణ సంస్థ మళ్లీ సెన్సార్‌కు పంపగా బోర్డు నుంచి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్ తరఫున మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. తొలుత యూ/ఏ సర్టిఫికేషన్‌కు సిఫార్సు చేసిన సెన్సార్ బోర్డు.. ఆ తర్వాత సినిమాను రివ్యూ కమిటీకి పంపిందని నిర్మాణ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. తాజాగా ఈ అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. సినిమాకు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మళ్లీ రివ్యూ కమిటీకి పంపాల్సిన అవసరం ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందుగా ఇస్తామన్న యూ/ఏ సర్టిఫికెట్ తక్షణమే ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తాజా తీర్పుతో 'జననాయగన్' విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలోనే సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోన్నట్లు

# ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్

## ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ

సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన



పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్-15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది.

ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ ప్రక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.

# శివకార్తికేయన్ పరాశక్తి నేడు విడుదల

శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'పరాశక్తి' ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు తాజాగా సర్టిఫికేట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా 1960ల నాటి హిందీ వ్యతిరేక ఉద్యమ నేపథ్యం ఉన్నందున, తొలుత సెన్సార్ బోర్డు 23 కట్స్ సూచించినప్పటికీ, రివైజింగ్ కమిటీ పరిశీలన తర్వాత కొన్ని మార్పులతో క్లియరెన్స్ లభించింది. సుమారు 162 నిమిషాల నిడివి ఉన్న ఈ పీరియాడిక్ పొలిటికల్ డ్రామాలో శివకార్తికేయన్ కాలేజీ విద్యార్థిగా కనిపించనున్నారు. ఈ సినిమా తమిళ వెర్షన్ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అయితే తెలుగులో సంక్రాంతి సినిమాల రద్దీ మరియు థియేటర్ల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా, తెలుగు వెర్షన్ విడుదలను జనవరి 23కి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జయం రవి, అథర్వ మురళి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ సినిమా కావడం విశేషం.

